ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

RNI No:/2023/87888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 02 సంచిక -2౦5 పేజీలు - 08 వెల - 06/- బుధవారం 7 మే 2025





# గాలి జైలుకు

## ఓబులాపురం మైనింగ్ కేసులో తుదితీర్పు

### గాలి జనార్ధన్ రెడ్డి తదితరులకు ఏడేళ్ల జైలు

### ఐదుగురిని దోషులుగా, ఇద్దరిని నిర్దోషులుగా ప్రకటించిన కోర్టు

### సబితను నిర్దోషిగా ప్రకటించిన కోర్టు



హైదరాబాద్, **మే6(రిపబ్లిక్ న్యూస్):-**
ఓబుళాపురం మైనింగ్ కేసులో నాంపల్లి సీబీఐ కోర్టు తుది తీర్పు వెలువరించింది. 15 ఏళ్ల పాటు సుదీర్ఘ విచారణ అనంతరం ఈ కేసులో మొత్తం ఐదుగురిని దోషులుగా, ఇద్దరిని నిర్దోషులుగా ప్రకటించింది. ఈ కేసులో ప్రధాన నిందితులైన గాలి జనార్దన్ రెడ్డి, బీవీ శ్రీనివాసరెడ్డి, మెఫజ్ అలీఖాన్, గనులశాఖ అప్పటి డైరెక్టర్ వీడీ రాజగోపాల్‌ను దోషులుగా నిర్ధారిస్తూ శిక్షలు ఖరారు చేసింది. గాలి జనార్దన్‌రెడ్డి సహా నలుగురికి ఏడేళ్ల పాటు జైలు శిక్ష ఖరారు చేసింది. అలాగే, దోషులకు రూ.10వేలు చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. ఓబుళాపురం మైనింగ్ కంపెనీకు రూ.2 లక్షలు జరిమానా విధించింది.

మిగతా 2లో

# యుద్ధం వస్తే సన్నద్ధం



అవాంఛనీయ సంఘటనలనైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పౌరులను, భద్రతా సిబ్బందిని సన్నద్ధం చేయడంలో భాగంగా ఈ మాక్ డ్రిల్స్ చేపడుతున్నారు. నగరంలోని నాలుగు వ్యూహాత్మక ప్రాంతాలైన సికింద్రాబాద్ కంటోన్మెంట్, గోల్కొండ, కంచన్‌బాగ్ డీఆర్‌డీఓ (రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ), మౌలాలిలోని ఎన్‌ఎఫ్‌సీలలో బుధవారం సాయంత్రం 4 గంటలకు ఈ భద్రతా విన్యాసాలు ఏకకాలంలో జరగనున్నాయని రక్షణ శాఖ ఉన్నతాధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

## హోంశాఖ ఆదేశాలతో నేడు మాక్ డ్రిల్

- దేశవ్యాప్తంగా మొత్తం 259 సున్నిత ప్రదేశాలలో ఈ మెగా సెక్యూరిటీ డ్రిల్
- భారత్-పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో దేశవ్యాప్తంగా భద్రతా మాక్ డ్రిల్స్
- హైదరాబాద్‌లో బుధవారం నాలుగు కీలక ప్రాంతాల్లో విన్యాసాలు
- సికింద్రాబాద్, గోల్కొండ, కంచన్‌బాగ్, మౌలాలి ఎన్‌ఎఫ్‌సీలో మాక్‌డ్రిల్స్
- సాయంత్రం 4 గంటలకు మాక్‌డ్రిల్స్ చేపట్టనున్న అధికారులు



న్యూఢిల్లీ, **మే6(రిపబ్లిక్ న్యూస్):-**
దేశంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా, కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు హైదరాబాద్ నగరంలో బుధవారం కీలక భద్రతా విన్యాసాలు (మాక్ డ్రిల్స్) నిర్వహించనున్నారు. ఇటీవల జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్ లో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు పెరిగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలనైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పౌరులను, భద్రతా సిబ్బందిని సన్నద్ధం చేయడంలో భాగంగా ఈ మాక్ డ్రిల్స్ చేపడుతున్నారు. నగరంలోని నాలుగు వ్యూహాత్మక ప్రాంతాలైన సికింద్రాబాద్ కంటోన్మెంట్, గోల్కొండ, కంచన్‌బాగ్ డీఆర్‌డీఓ (రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ), మౌలాలిలోని ఎన్‌ఎఫ్‌సీలలో బుధవారం సాయంత్రం 4 గంటలకు ఈ భద్రతా విన్యాసాలు ఏకకాలంలో జరగనున్నాయని రక్షణ శాఖ ఉన్నతాధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.దేశవ్యాప్తంగా మొత్తం 259 సున్నిత ప్రదేశాలలో ఈ మెగా సెక్యూరిటీ డ్రిల్ నిర్వహించేందుకు కేంద్రం ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ మాక్ డ్రిల్స్ నిర్వహణపై కేంద్ర హోం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉన్నతస్థాయి సమావేశం జరిగింది.

మిగతా 2లో



2లో

## మిస్ వరల్డ్ పోటీలకు హైదరాబాద్ సిద్ధం

- సర్వాంగ సుందరంగా ముస్తాబవుతున్న నగరం
- అందాల పోటీలు తెలంగాణకు గర్వమన్న జూపల్లి
- తెలంగాణ సంప్రదాయం నచ్చిందన్న మిస్ ఇండియా

# ప్రజా రిపబ్లిక్ వార్తకు స్పందించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం

## ఉపాధి హామీ సిబ్బందికి వేతనాల విడుదల

**జగిత్యాల జిల్లా ప్రతినిధి, మే 06( రిపబ్లిక్ న్యూస్)**
మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లో విధులు నిర్వహించే ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్ లతో పాటు సిబ్బందికి గత నాలుగు నెలలుగా పెండింగ్ లో ఉన్న వేతనాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం విడుదల చేసింది. ఉపాధి హామీ సిబ్బంది వేతనాలు పెండింగ్ లో ఉండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సిబ్బంది విషయాన్ని ప్రజా రిపబ్లిక్ దినపత్రికలో గత ఏప్రిల్ మాసం 7వ తేదీన వార్త ప్రచురించిన విషయం విధితమే. ప్రజా రిపబ్లిక్ వార్తకు స్పందించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ సిబ్బందికి వేతనాలను విడుదల చేయడం పట్ల ఫీల్డ్ అసిస్టెంట్ లు హర్షం వ్యక్తం చేస్తూ, ప్రజా రిపబ్లిక్ దినపత్రికకు ధన్యవాదాలు తెలిపారు.



ప్రజా రిపబ్లిక్ ప్రతి అక్షరం ప్రజల కోసం

www.prajarepublic.com
08 Apr 2025 - Page 6

### వేతనాల చెల్లింపు లేక ఇబ్బందుల పాలవుతున్న ఉపాధి హామీ సిబ్బంది

**- రాష్ట్రవ్యాప్తంగా 3,874 మంది కాంటాక్ట్ ఉద్యోగుల ఎదురుచూపులు**

**జగిత్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 07( రిపబ్లిక్ న్యూస్)**
మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలకే కాదు, ఉద్యోగులకు కూడా వేతనాలు చెల్లించగా నాలుగు మాసాలు పూర్తి కావస్తుంది. ప్రభుత్వం నుండి వేతనాలు అందకపోయినా, అప్పులు చేసి మరి ఉపాధి హామీ ఉద్యోగులు బతుకు వెళ్లదీసుకుంటూ, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా కేంద్ర ప్రభుత్వం 2005లో ఆగస్టు 25న అట్టహాసంగా ఈ పథకాన్ని ప్రారంభించింది. అరకోర వేతనాలతో ఈజీఎస్ ఉద్యోగులు, చాలీచాలని కూలి డబ్బులతో ఉపాధి హామీ కూలీలు గత 19 ఏళ్లుగా కాలం వెల్లదీస్తున్నారు. ఈ పథకం ఉద్యోగుల్లో ఏపీవో, ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు మొత్తం కలిపి రాష్ట్రవ్యాప్తంగా 3,874 మంది ఉద్యోగులు ఉన్నట్లు సమాచారం. వీరందరికీ జనవరి 2025 మాసం నుండి ప్రభుత్వం వేతనాలను విడుదల చేయలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఉపాధి హామీ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని ప్రకటించడంతో, ఆనందోత్సాహాలతో ఉద్యోగులు సంబరాలు జరుపుకున్నారు. కానీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మొదట్లో కొంత హడావిడి చేసిన, మళ్లీ ఈ నిర్ణయాన్ని నిలిపివేశారని ఉపాధి హామీ ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి మాకు రావాల్సిన పెండింగ్ వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ఉపాధి హామీ పథకం ఉద్యోగులు కోరుతున్నారు.

**- పని ప్రదేశంలో మౌలిక సదుపాయాలు లేవని కూలీల ఆవేదన**

ఉపాధి హామీ పథకంలో రోజువారి కూలీ పనిచేసే కూలీల డబ్బుల చెల్లింపు మాట దేవుడెరుగు, వారికి కూడా గత నాలుగు నెలలుగా కూలీ డబ్బులు అందడం లేదని వాపోతున్నారు. అంతేకాకుండా పని ప్రదేశంలో మౌలిక సదుపాయాలు కల్పించడం లేదని, తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పని ప్రదేశంలో మంచినీటి సౌకర్యం, నీడ ఏర్పాటు, మెడికల్ కిట్ అందుబాటులో ఉంచడం, పని ప్రదేశం రెండు కిలోమీటర్ల దూరం ఉంటే ఎండ తీవ్రత ఎక్కువ ఉన్నందున రవాణా సదుపాయం కల్పించాలని, అలాగే గడ్డపార, పార పదునుల కోసం డబ్బులు చెల్లించాలని కోరుతున్నారు. అంతే కాకుండా రోజువారి కూలీ రూ.307/- చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించిన, ఇంతవరకు ఏ ఒక్క కూలికి కూడా అందలేదని వాపోతున్నారు. ప్రస్తుతం పెరుగుతున్న ధరలకు అనుకూలంగా రోజువారి కూలీ డబ్బులు రూ.600/- చెల్లించాలని ఉపాధి హామీ కూలీలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# సజ్జల కుటుంబం భూకబ్జా నిజమే..



- వైఎస్సార్ జిల్లా సీకే దిన్నెలో సజ్జల కుటుంబం భూ ఆక్రమణలు
- మొత్తం 63.72 ఎకరాలు కబ్జా చేసినట్లు విచారణ కమిటీ నిర్ధారణ
- ఆక్రమణలో 52.40 ఎకరాల అటవీ భూమి, పాయవంక రిజర్వాయర్ భూమి
- అక్రమిత భూముల్లో నిర్మాణాలు, ప్రభుత్వ రాయితీల వినియోగం
- భూమి స్వాధీనానికి, కఠిన చర్యలకు ప్రభుత్వానికి కమిటీ సిఫారసు

2లో

# ఆర్టీసీ సమ్మె వాయిదా

- తెలంగాణలో ప్రయాణికులకు ఊరట..
- ఆర్టీసీ సమ్మెను తాత్కాలిక వాయిదా వేసిన కార్మికులు
- మంత్రి పొన్నంతో ఆర్టీసీ జేఏసీ నాయకుల భేటీ
- ఆర్టీసీ సమస్యలపై త్రిసభ్య కమిటీ ఏర్పాటు




హైదరాబాద్, **మే6(రిపబ్లిక్ న్యూస్):-**
తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ) కార్మికులు తలపెట్టిన సమ్మె తాత్కాలికంగా వాయిదా పడింది. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో ఆర్టీసీ కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ సమితి (జేఏసీ) నేతలు జరిపిన చర్చలు సఫలం కావడంతో ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. కార్మికుల డిమాండ్లు, సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది.వివరాల్లోకి వెళితే, తమ దీర్ఘకాలిక డిమాండ్ల సాధన కోసం టీజీఎస్‌ఆర్టీసీ జేఏసీ నేతలు ఇటీవల సమ్మెకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. మే 6వ తేదీ అర్ధరాత్రి వరకు ప్రభుత్వం నుంచి చర్చలకు ఆహ్వానం అందకపోతే, మే 7వ తేదీ నుంచి సమ్మెకు దిగుతామని వారు స్పష్టం చేశారు.

# కొత్త రేషన్ కార్డుల జారీకి నేటి నుంచి దరఖాస్తులు

### క్యూఆర్ కోడ్‌తో కొత్త కార్డుల జారీ

### -మార్పులు,చేర్పులకు కూడా అవకాశం: నాదెండ్ల

అమరావతి, **మే6(రిపబ్లిక్ న్యూస్):-**
రాష్ట్రంలో మే 7నుంచి కొత్త రేషన్‌కార్డుల జారీకి దరఖాస్తులు స్వీకరిస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కొత్త కార్డులు జారీ, రేషన్‌కార్డు స్ప్లిట్, కొత్త సభ్యుల చేరిక, చిరునామా మార్పులు చేసేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు.

మిగతా 2లో






# రూ.1కే యూనిట్ విద్యుత్

## నూతన ఎలక్ట్రానిక్స్ విధానం విడుదల చేసిన ఏపీ ప్రభుత్వం

- ఏపీ నూతన ఎలక్ట్రానిక్ పాలసీ విడుదల
- ఎలక్ట్రానిక్స్ తయారీకి ఏపీ భారీ ప్రోత్సాహం
- రూ.4.2 లక్షల కోట్ల ఉత్పత్తి, 10 బిలియన్ డాలర్ల పెట్టుబడులే లక్ష్యం

2లో

# సచివాలయంలో కలాం విగ్రహావిష్కరణ

అమరావతి, **మే6(రిపబ్లిక్ న్యూస్):**-ఏపీ సచివాలయంలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం విగ్రహాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళవారం ఆవిష్కరించారు. వైబ్రాంట్స్ ఆఫ్ కలాం సంస్థ తయారు చేసిన విగ్రహాల్ని రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేయాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. జూలై 27న అబ్దుల్ కలాం వర్ధంతి రోజున ఈ విగ్రహాలను ఉమ్మడి 13 జిల్లాల్లో ఆవిష్కరించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోమొత్తం 25 కలాం విగ్రహాలను ఆవిష్కరించాలని భావిస్తున్నామని ఈ సందర్భంగా వైబ్రాంట్స్ ఆఫ్ కలాం ప్రతినిధి విజయ్ తెలిపారు.సుప్రీం కోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా 20 అడుగుల అబ్దుల్ కలాం విగ్రహాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. యువతకు స్ఫూర్తిని ఇచ్చేలా ఈ విగ్రహాల ఏర్పాటు ఉంటుందని విజయ్ పేర్కొన్నారు.



# కొత్త రేషన్ కార్డుల జారీకి నేటి నుంచి దరఖాస్తులు

### క్యూఆర్ కోడ్‌తో కొత్త కార్డుల జారీ -మార్పులు,చేర్పులకు కూడా అవకాశం: నాదెండ్ల

**(మొదటి పేజి తరువాయి)** ఇప్పటి వరకు రేషన్‌కార్డుల్లో మార్పుల కోసం 3.28లక్షల దరఖాస్తులు వచ్చాయన్నారు. క్యూఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్ రేషన్‌కార్డును జారీ చేస్తామని చెప్పారు. ఇందులో కుటుంబసభ్యుల పేర్లు చక్కగా కనిపించేలా ఉంటుందని అన్నారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే గడిచిన ఆరు నెలలుగా తీసుకున్న రేషన్ వివరాలు కనిపిస్తాయని చెప్పారు. దేశంలో ఎక్కడైనా రేషన్ తీసుకునేలా ఈ కార్డు వెసులుబాటు కల్పిస్తుంది. నెలరోజులపాటు ఈ రేషన్ కార్డు దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని అన్నారు. గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్లి పౌరులు తమ వివరాలు తెలుసుకోవచ్చు. జూన్ నుంచే స్మార్ట్ కార్డులు జారీ అవుతాయి. ప్రస్తుతం 95 శాతం మేర ఈ కేవైసీ పూర్తి అయింది. ఈకేవైసీ పూర్తి అయిన వారు కొత్తగా దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఈ నెల 12 నుంచి




దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. అకాల వర్షంతో నష్టపోయిన రైతులందరికీ పంట నష్ట పరిహారం అందజేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు 1.50 కోట్ల మందికి దీపం పథకం ద్వారా లబ్ధి కలిగిందన్నారు. పాఠశాలలకు 25 కేజీల ఫైన్ క్వాలిటీ రైస్ ఈ ఏడాది నుంచి సరఫరా చేయబోతున్నామని వెల్లడించారు. రేషన్ కార్డులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి సరెండర్ చేసేందుకు అవకాశం ఉందని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. వేరే ప్రాంతానికి వలస వెళితే రేషన్ కార్డులను సరెండర్ చేయొచ్చని సూచించారు. ఇక, కొత్త రేషన్ కార్డులని స్మార్ట్ కార్డు తరహాలో ఇస్తున్నాం అని తేల్చి చెప్పారు. కొత్త డిజైన్ చేసి రేషన్ కార్డు ఇస్తున్నాం.. అని మనోహర్ పేర్కొన్నారు.అయితే, గ్రామ వార్డ్ సచివాలయంలో కొత్త రేషన్ కార్డు కోసం వివరాలు నమోదు చేసుకోవాలి అని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల చెప్పారు. జూన్ లో అందరికి కొత్త రేషన్ కార్డులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. తడిసిన ధాన్యం ఖచ్చితంగా కొనుగోలు చేసేలా ఆదేశాలు ఇచ్చామని నాదెండ్ల మనోహర్ వెల్లడించారు.

# గాలి జైలుకు




**(మొదటి పేజి తరువాయి)**

ఈ కేసులో అప్పటి గనులశాఖ మంత్రిగా ఉన్న సబితా ఇంద్రారెడ్డికి ఉపశమనం లభించింది. ఆమెతో పాటు అప్పటి పరిశ్రమల శాఖ కార్యదర్శి కృపానందంను సీబీఐ కోర్టు నిర్దోషులుగా ప్రకటించింది.ఈ కేసులో వీడీ రాజగోపాల్‌కు అదనంగా మరో నాలుగేళ్లు జైలు శిక్ష విధించింది. భూగర్భ గనుల శాఖ డైరెక్టర్‌గా ఉన్నందున అవినీతి నిరోధక చట్టం కింద ఆయనకు అదనపు శిక్షను ఖరారు చేసింది. ప్రభుత్వ అధికారిగా ఉంటూ అక్రమాలకు పాల్పడినందున మొత్తంగా 11 ఏళ్ల పాటు అతడికి జైలు శిక్ష పడింది. ఈ కేసులో ఏ2గా ఉన్న కర్ణాటక మాజీ మంత్రి గాలి జనార్దన్ రెడ్డికి ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. గాలి జనార్దన్ రెడ్డితో సహా నలుగురికి ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. ప్రస్తుతం గాలి జనార్దన్ రెడ్డి కర్ణాటకలోని గంగావతి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఓబులాపురం మైనింగ్ కేసులో ఆయనకు ఏడేళ్ల జైలు శిక్ష ఖరారు కావడంతో ఆయనపై అనర్హత వేటు పడే అవకాశం ఉంది. 'కల్యాణ రాజ్య ప్రగతి పక్ష' అనే పొలిటికల్ పార్టీని స్థాపించి 2023 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో గాలి జనార్దన్ రెడ్డి గంగావతి నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత మళ్లీ బీజేపీలో చేరిపోయారు. అయితే.. సీబీఐ కోర్టు వెలువరించిన తీర్పును ఉన్నత న్యాయస్థానాల్లో సవాల్ చేసే అవకాశం కూడా ఉంది. ఇకపోతే ఓఎంసీ కేసులో గాలి జనార్దన్ రెడ్డి ఇప్పటికే కొంత కాలం జైలు జీవితం గడిపిన సంగతి తెలిసిందే. ఓబులాపురం మైనింగ్ కేసులో విచారణ దాదాపు 13 ఏళ్లకు పైగానే సాగింది.

3,,400 డాక్యుమెంట్లను పరిశీలించి, 219 మంది సాక్ష్యులను విచారించి.. కర్ణాటక ఫారెస్ట్ ల్యాండ్స్‌లో గాలి బ్రదర్స్ మైనింగ్ తవ్వకాల వల్ల 884.13 కోట్ల రూపాయలను రాష్ట్రం నష్టపోయిందనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి సీబీఐ కోర్టు తుది తీర్పు వెల్లడించడం గమనార్హం. 2007 జూన్ 18న ఓఎంసీకి లీజులు కేటాయిస్తూ అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉద్దేశపూర్వకంగానే 'క్యాప్టివ్' అనే పదాన్ని తొలగించారని, తద్వారా అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై 2009లో డిసెంబర్ 7న తొలిసారి సీబీఐ కేసు నమోదు చేసింది. ఆ తర్వాత తెలంగాణ హైకోర్టులో స్టే రావడం, మళ్లీ డివిజన్ బెంచ్ స్టే ఎత్తివేయడం.. ఇలా పలు రకాల పిటిషన్లు వేయడంతో దాదాపు 15 ఏళ్ల పాటు విచారణ కొనసాగింది. ఐదేళ్లు దర్యాప్తునకే సమయం పట్టింది. 2009 నుంచి 2014 వరకు సీబీఐ నాలుగు ఛార్జిషీట్‌లను దాఖలు చేసింది. ఓఎంసీ వ్యవహారంలో 2011లో ఛార్జిషీట్‌ను తొలిసారి వేయగా.. 2014లో తుది ఛార్జిషీట్ తర్వాత సుదీర్ఘంగా విచారణ జరిగింది. 219 మంది సాక్షులను విచారించింది. ప్రత్యక్షంగా, పరోక్షంగా పలు సాక్ష్యాలు, ఆధారాలను సీబీఐ సేకరించింది. అనంతపురంలోని ఓబుళాపురంలో గనుల కేటాయింపు, తవ్వకాలకు సంబంధించి అత్యాధునిక పరికరాలతో సీబీఐ ఆధారాలు సేకరించింది. అక్రమంగా తవ్వకాలు, రవాణా, ఎగుమతులు, విక్రయాల్లో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగినట్లు- సీబీఐ గుర్తించింది. ఏపీ, కర్ణాటక సరిహద్దుల్లో పెద్ద ఎత్తున తవ్వకాలు చేపట్టినట్లు అధికారులు గుర్తించారు. దీనిపై పూర్తి ఆధారాలు, సాక్ష్యాల సేకరణతో 2014లో తుది ఛార్జిషీట్ దాఖలైంది. విదేశాలకు అక్రమంగా దాదాపు 60 లక్షల మెట్రిక్ టన్నుల ఇనుప ఖనిజాన్ని ఎగుమతి చేశారని, అక్రమ బినామీ లావాదేవీలు జరిగినట్లు- గుర్తించామని సీబీఐ ఛార్జిషీట్‌లో పేర్కొంది. ఈ కేసు విచారణలో మొత్తంగా 3337 డాక్యుమెంట్లను పరిశీలించారు. ప్రభుత్వం కేటాయించిన 68 హెక్టార్లలో కాకుండా పెద్ద ఎత్తున మైనింగ్ చేపట్టినట్లు సీబీఐ గుర్తించింది. ఈ కేసులో విచారణ దశలోనే ఏ5 లింగారెడ్డి మృతి చెందగా.. ఏ6 శ్రీలక్ష్మిని 2022లో ఈ కేసు నుంచి తెలంగాణ హైకోర్టు డిశ్చార్జి చేసింది. మొత్తంగా ఈ కేసునుంచి మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డికి ఊరట దక్కడంతో ఆమె ఆనందం వ్యక్తం చేశారు.

# సజ్జల కుటుంబం భూకబ్జా నిజమే..

అమరావతి, **మే6(రిపబ్లిక్ న్యూస్):**-

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో అత్యంత కీలక నేతగా వ్యవహరించిన సజ్జల రామకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు పెద్ద మొత్తంలో ప్రభుత్వ, అటవీ భూములను ఆక్రమించుకున్నట్లు విచారణలో తేలింది. వైఎస్సార్ జిల్లా సీకే దిన్నె గ్రామ పరిధిలో ఏకంగా 63.72 ఎకరాల భూమిని వారు కబ్జా చేశారని ప్రభుత్వం నియమించిన త్రిసభ్య విచారణ కమిటీ నిర్ధారించింది. ఈ మేరకు కమిటీ తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది.ఆక్రమణలో

**అటవీ, ప్రభుత్వ భూములు**

విచారణ కమిటీ నివేదిక ప్రకారం, సజ్జల కుటుంబం ఆక్రమించుకున్న భూమిలో సింహభాగం అటవీ శాఖకు చెందినదే. సీకే దిన్నె గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 1629లో ఏకంగా 52.40 ఎకరాల అటవీ భూమిని ఎనిమిది వేర్వేరు ప్రాంతాల్లో ఆక్రమించినట్లు కమిటీ గుర్తించింది. దీంతో పాటు, గతంలో పాయవంక రిజర్వాయర్ నిర్మాణం కోసం ప్రభుత్వం సేకరించిన 8.05 ఎకరాల భూమి, మరికొంత అసైన్డ్ భూమి కూడా ఈ ఆక్రమణలో ఉన్నట్లు తేలింది. ఈ భూముల చుట్టూ కంచె వేయడమే కాకుండా, ఎటువంటి అనుమతులు లేకుండా ఒక అతిథి గృహం, నాలుగు గదులను నిర్మించారని కమిటీ తన నివేదికలో పేర్కొంది.

**అక్రమ సాగు.. ప్రభుత్వ రాయితీలు**

ఆక్రమించుకున్న అటవీ భూముల్లో సజ్జల కుటుంబ సభ్యులు పండ్ల తోటలు పెంచుతున్నారని, అడవిని ధ్వంసం చేసి పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగించారని కమిటీ తెలిపింది. కేవలం అక్రమంగా సాగు చేయడమే కాకుండా, ఆ భూముల్లో డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థ ఏర్పాటుకు, మామిడి కాయల నిల్వ కోసం 'హార్వెస్టింగ్



రూం' నిర్మాణానికి ప్రభుత్వ పథకాల కింద రాయితీలు కూడా పొందారని నివేదిక స్పష్టం చేసింది. సజ్జల రామకృష్ణారెడ్డి అన్న కుమారుడైన సజ్జల సందీప్‌రెడ్డితో పాటు మరో ఆరుగురు కుటుంబ సభ్యులను ఈ భూముల ఆక్రమణదారులుగా కమిటీ గుర్తించింది.

**గతంలో ఫిర్యాదులు.. హైకోర్టు జోక్యం**

కడప నగరానికి సుమారు 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ 'సజ్జల ఎస్టేట్' భూముల కబ్జాపై రాజా నాయక్ అనే స్థానికుడు 2022 నుంచి పలుమార్లు ప్రభుత్వానికి ఫిర్యాదులు చేసినా గత ప్రభుత్వ హయాంలో అధికారులు పట్టించుకోలేదని తెలిసింది. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరాక ఈ ఆరోపణలపై విచారణకు ఆదేశాలు జారీ అయ్యాయి. అయితే, ఈ విచారణను వ్యతిరేకిస్తూ సజ్జల సందీప్‌రెడ్డి తదితరులు హైకోర్టును ఆశ్రయించారు. సీకే దిన్నె పరిధిలో తమకు 184.32 ఎకరాలు ఉన్నాయని, అందులో పండ్ల తోటలు సాగు చేస్తున్నామని, ప్రభుత్వ జోక్యాన్ని నిలువరించాలని కోరారు. దీనిపై హైకోర్టు యథాతథ స్థితిని కొనసాగించాలని ఆదేశిస్తూనే, విచారణ కొనసాగించుకోవచ్చని స్పష్టం చేసింది.

**సర్వేలో వెల్లడైన వాస్తవాలు.. 2014లోనే నోటీసులు**

హైకోర్టు ఆదేశాల మేరకు వైఎస్సార్ జిల్లా కలెక్టర్, కడప ఆర్డీవో, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్, బద్వేల్ సబ్ డివిజనల్ అటవీ అధికారితో కూడిన త్రిసభ్య కమిటీని నియమించారు. ఈ కమిటీ ఫిబ్రవరి, మార్చి నెలల్లో సజ్జల కుటుంబ సభ్యుల ప్రతినిధుల సమక్షంలోనే సర్వే నిర్వహించింది. సర్వేలో మొత్తం 201.17 ఎకరాలు సజ్జల కుటుంబం ఆధీనంలో ఉన్నట్లు తేలింది. అయితే, వారి పేరిట ఉన్న పట్టా భూమి కేవలం 137.45 ఎకరాలు మాత్రమేనని, మిగిలిన 63.72 ఎకరాలు ఆక్రమిత భూమేనని కమిటీ నిర్ధారించింది. కాగా, ఈ అటవీ భూముల ఆక్రమణపై 2014లోనే సంబంధిత ఫారెస్ట్ రేంజ్ అధికారి సజ్జల కుటుంబానికి నోటీసులు జారీ చేసినట్లు కూడా కమిటీ తన నివేదికలో పేర్కొంది.

**భూములు స్వాధీనం చేసుకోవాలని సిఫారసు**

సజ్జల కుటుంబ సభ్యులు ఉద్దేశపూర్వకంగా అటవీ భూముల్ని ఆక్రమించి పర్యావరణానికి, జీవ వైవిధ్యానికి తీవ్ర నష్టం కలిగించారని, వన్యప్రాణుల ఆవాసాలను ధ్వంసం చేశారని కమిటీ అభిప్రాయపడింది. ఆక్రమణకు గురైన 52.40 ఎకరాల అటవీ భూమిని తక్షణమే అటవీ శాఖ స్వాధీనం చేసుకుని, పటిష్ట రక్షణ చర్యలు చేపట్టాలని సూచించింది. అటవీ, పర్యావరణ చట్టాలను ఉల్లంఘించినందుకు సజ్జల కుటుంబ సభ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఈ నివేదిక ఆధారంగా ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకునే

# రూ.1కే యూనిట్ విద్యుత్ సరఫరా..

### నూతన ఎలక్ట్రానిక్స్ విధానం విడుదల చేసిన ఏపీ ప్రభుత్వం

అమరావతి, **మే6(రిపబ్లిక్ న్యూస్):**-

రాష్ట్రంలో ఎలక్ట్రానిక్ రంగం అభివృద్ధి లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నూతన ఎలక్ట్రానిక్ ఉత్పత్తి విధానానికి సంబంధించిన మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ పాలసీ ద్వారా రూ.4.2 లక్షల కోట్ల విలువైన ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులను రాష్ట్రంలో తయారు చేయాలని, అలాగే 10 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఈ భారీ పెట్టుబడుల ద్వారా రాష్ట్ర యువతకు ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది.

ఈ నూతన విధానం కింద, ఎలక్ట్రానిక్స్ తయారీ యూనిట్లకు పెట్టుబడుల ఆధారంగా, కేటగిరీల వారీగా ప్రోత్సాహకాలు అందించనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ముఖ్యంగా, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి యూనిట్లకు 100 శాతం స్టాంప్ డ్యూటీ మినహాయింపు ఇవ్వనున్నట్లు తెలిపింది. అంతేకాకుండా, పరిశ్రమలో నియమితులయ్యే ఒక్కో ఉద్యోగికి నెలకు రూ.4,000 నుంచి రూ.6,000 వరకు ఐదేళ్ల పాటు ప్రోత్సాహకంగా అందించనున్నారు. పారిశ్రామిక ప్రగతికి అత్యంత కీలకమైన విద్యుత్‌ను కూడా రాయితీపై అందించాలని నిర్ణయించారు. ఎలక్ట్రానిక్ పరిశ్రమలకు ఐదేళ్లపాటు యూనిట్ విద్యుత్‌ను కేవలం రూపాయికే సరఫరా చేయాలని ప్రభుత్వం పేర్కొంది.రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు అనువైన వాతావరణం ఉందని ప్రభుత్వం వివరించింది. విశాఖపట్నం, తిరుపతి, శ్రీసిటీ, నెల్లూరు, కడప, అనంతపురం వంటి ప్రాంతాల్లో ఇప్పటికే ఎలక్ట్రానిక్ క్లస్టర్లు ఉన్నాయని గుర్తు చేసింది. నైపుణ్యం కలిగిన యువత, ప్రభుత్వ అనుకూల విధానాలు, మెరుగైన లాజిస్టిక్స్ నెట్‌వర్క్, విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్ వంటివి పెట్టుబడులకు అనుకూలంగా ఉన్నాయని ప్రభుత్వం తెలియజేసింది. ఈ సమగ్రమైన ప్రోత్సాహకాలతో కూడిన నూతన పాలసీ ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలో కీలక కేంద్రంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

# యుద్ధం వస్తే సన్నద్ధం

**(మొదటి పేజి తరువాయి)**

ఈ సమావేశంలో, దాడులకు అవకాశం ఉన్న ప్రాంతాలను మూడు కేటగిరీలుగా వర్గీకరించారు. తెలుగు రాష్ట్రాల్లోని హైదరాబాద్, విశాఖపట్నం నగరాలు కేటగిరీ-2లో ఉన్నాయి

భారత్-పాకిస్థాన్ సరిహద్దులో భారత వాయుసేన బుధవారం మాక్ డ్రిల్స్ మొదలు పెట్టనుంది. ఇందులో రఫేల్, మిరాజ్ 2000, సుఖోయ్-30 వంటి అన్ని రకాల యుద్ధవిమానాలు పాల్గొననున్నట్లు- వాయుసేన అధికారులు వెల్లడించారు. దాదాపు ఐదున్నర గంటలపాటు- ఇవి కొనసాగే అవకాశం ఉన్నట్లు- సమాచారం. దీంతో సరిహద్దు ఎయిర్‌పోర్టుల్లో విమానాల రాకపోకలు పూర్తిగా నిలిపివేయనున్నారు. భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ.. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ సూచన మేరకు సంక్షోభ సమయంలో పౌరులు వ్యవహరించాల్సిన తీరుపై దేశ వ్యాప్తంగా మాక్ డ్రిల్స్ చేపట్టనున్నారు. ఇదే సమయంలో భారత వాయుసేన కూడా రాజస్థాన్‌లోని అంతర్జాతీయ సరిహద్దులో భారీస్థాయిలో విన్యాసాలు చేసేందుకు సిద్ధమైంది. ఇందుకు సంబంధించి పైలట్లకు ఇచ్చే సమాచారాన్ని వాయుసేన జారీ చేసింది. మరోవైపు శత్రుదేశం దాడులు చేస్తే సురక్షితంగా ప్రాణాలు కాపాడుకోవడంపై అవగాహన కల్పించేందుకు సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్స్ నిర్వహిస్తున్నారు. ఇందుకోసం దేశవ్యాప్తంగా దాదాపు 300 ప్రాంతాలను ఎంపిక చేశారు. వైమానిక దాడులు, బాంబు దాడులు జరిగితే ఎలా రక్షించుకోవాలో ప్రజలు, విద్యార్థులకు తెలియజేయనున్నారు. అత్యవసర పరిస్థితులు ఏర్పడినప్పుడు చేపట్టాల్సిన చర్యలపై కేంద్ర మార్గదర్శకాలను అనుసరించి ఈ డ్రిల్స్ చేపడతారు.

# మిస్ వరల్డ్ పోటీలకు హైదరాబాద్ సిద్ధం

హైదరాబాద్, **మే6(రిపబ్లిక్ న్యూస్):**-మిస్ వరల్డ్ పోటీలకు హైదరాబాద్ సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. పోటీల్లో పాల్గొనేందుకు అందాలభామలు భాగ్యనగరానికి చేరుకుంటున్నారు. వందకు పైగా దేశాల నుంచి వచ్చే సుందరీమణులకు స్వాగతం పలికేందుకు శంషాబాద్ విమానాశ్రయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో మిస్‌వరల్డ్ పోటీలపై హైటెక్ సిటీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, మిస్ వర్లడ్ సీఈవో జూలియా, మిస్‌ఇండియా వరల్డ్ నందిని గుప్తా, పటేల్ రమేశ్ రెడ్డి, జయేశ్ రంజన్, సోనూసూద్ తదితరులు పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో మిస్ వరల్డ్ పోటీలు జరగడం రాష్ట్రానికి గర్వకారణమని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఈ పోటీల కోసం వస్తున్న ప్రతి ఒక్కరికీ గొప్ప అనుభూతిని పంచేలా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. మిస్ వరల్డ్ గ్లోబల్ యూనిట్‌కి వేదిక అన్న ఆయన.. మన రాష్ట్ర సంప్రదాయం, పర్యాటక ప్రాముఖ్యతను ప్రపంచానికి చాటేందుకు ఇదో చక్కని అవకాశమన్నారు. పర్యాటకశాఖ కార్యదర్శి జయేశ్ రంజన్ మాట్లాడుతూ.. తెలంగాణ ఆహారం, సంస్కృతి, పర్యాటకాన్ని ప్రపంచానికి చాటేందుకు ఈ పోటీలు దోహదం చేయనున్నాయన్నారు. విదేశీ పర్యాటకులను ఆకట్టుకొనేందుకు ఇదో మంచి అవకాశం. అందరం కలిసి ఈ పోటీలను విజయవంతం చేయాలి. వీవీఐపీల కోసమే అందాల పోటీలు అనే అభిప్రాయం లేకుండా సామాన్యులు సైతం హాజరయ్యేందుకు అవకాశం కల్పిస్తున్నాం. ఈ పోటీలను తిలకించాలనే ఆసక్తి ఉన్నవారు పర్యాటక శాఖ అధికారిక వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని జయేశ్ రంజన్ సూచించారు.ఇండియా మిస్ వరల్డ్ 2025 పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తున్న మిస్ ఇండియా నందిని గుప్తా తనను హైదరాబాద్ బిర్యానీ, ఇరానీ చాయ్ కట్టిపడేశాయని తెలిపారు. తనకు తెలంగాణ ఎంతగానో నచ్చిందని, ఇక్కడ గొప్ప చరిత్ర ఉందని కొనియాడారు. కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీతో ఫాస్ట్ గా డెవలప్ అవుతున్న సిటీ- హైదరాబాద్ అని పేర్కొన్నారు. మిస్ వరల్డ్ పోటీల కోసం వచ్చిన నందిని గుప్తా.. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను గురించి తెలుసుకుని సంబురపడ్డారు. ఇప్పటికే తెలంగాణలోని పలు చారిత్రక కట్టడాలు, ఆలయాలు, పర్యాటక స్థలాలను సందర్శించారు. పోచంపల్లి హ్యాండ్లూమ్స్ తనకు ఎంతో నచ్చాయని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. యాంగస్ట్ స్టేట్ అయినా కూడా ఇక్కడ హాస్పటాలిటీ బాగుందని కొనియాడారు. 'అందరికీ నమస్కారం.. తెలంగాణకు తప్పకుండా రండి..' అంటూ తెలుగులో మాట్లాడారు నందిని గుప్తా. తెలంగాణ గురించి మాట్లాడిన ప్రతిసారి తనకు గొప్ప అనుభూతి కలుగుతుందని మిస్ ఇండియా నందిని గుప్తా అన్నారు. ఇక్కడి సంస్కృతి, అభివృద్ధి ఎంతో గొప్పగా ఉంటాయన్నారు. హైదరాబాద్ ఎంతో వేగంగా అభివృద్ధి చెందుతోందన్న ఈ అందాల భామ.. ఇక్కడి ప్రజలు ప్రేమను పంచుతున్నారన్నారు. హైదరాబాదీ బిర్యానీ నుంచి ఇరానీ చాయ్ వరకు ఆహారం అద్భుతంగా ఉటుందని చెప్పారు. పోటీ-ల్లో పాల్గొనే ప్రతి యువతి ఒక గొప్ప లక్ష్యంతో ముందడుగు వేస్తున్నారని చెప్పారు.

# పహల్గామ్ దాడి..మోడీకి ముందే తెలుసు

### కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే సంచలన వ్యాఖ్యలు

### ఖర్గే వ్యాఖ్యలపై మండపడ్డ బిజెపి నేతలు

న్యూఢిల్లీ,, **మే6(రిపబ్లిక్ న్యూస్):**- పహల్గాం ఉగ్రదాడి ఘటనపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సంచలన వ్యాఖ్యలు చేశారు. హహల్గాం ఉగ్రదాడి ఘటనకు మూడు రోజులకు ముందే ఇంటెలిజెన్స్ సమాచారం అందడటంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జమ్మూకశ్మీర్ పర్యటనను రద్దు చేసుకున్నారని అన్నారు. జార్ఖండ్‌లోని రాంచీలో మంగళవారంనాడు జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ ఆరోపణలు చేశారు. ఇంటెలిజెన్స్ వైఫల్యం ఉంది. ప్రభుత్వం కూడా దీనిని అంగీకరించింది. ఇంటెలిజెన్స్ పటిష్టం చేసుకుంటామని వాళ్లే చెప్పారు. అయితే దాడికి మూడు రోజుల ముందే ప్రధానికి నిఘా సమాచారం అందినట్టు నాకు తెలిసింది. దాంతోనే ఆయన జమ్మూకశ్మీర్ పర్యటనను రద్దు చేసుకున్నారు. ఈ విషయాన్ని వార్తా పత్రికల్లో కూడా చూశాను. దీనిపై ప్రధాని సమాధానం చెప్పాలని అన్నారు. ఏదేమైనా పహల్గాం దాడికి వ్యతిరేకంగా పాకిస్థాన్‌పై ఎటువంటి చర్య తీసుకున్నా ప్రభుత్వానికి కాంగ్రెస్ మద్దతుగా నిలుస్తుందని అన్నారు. రాంచీ వేదికగా నిర్వహించిన కార్యక్రమంలో ఈ మాటలు మాట్లాడారు.పహల్గాం ఉగ్రదాడికి సంబంధించి కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన విమర్శలపై భాజపా తీవ్రంగా స్పందించింది. భద్రతా బలగాల స్థయిర్యాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తంచేసింది.

# కర్నూలు నందు సాయి అనాధ ఆశ్రమాన్ని తనిఖీ చేసిన న్యాయమూర్తి



**కర్నూలు ప్రతినిధి మే 6 (రిపబ్లిక్ న్యూస్)**



రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి గారు, మంగళవారం నాడు కర్నూలు బుధవారపేట నందు గల సాయి అనాధ ఆశ్రమాన్ని తనిఖీ చేయడం జరిగింది. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలతో తనిఖీ చేపట్టారు. ఆశ్రమంలోనీ నిరాశ్రయులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అనాధ ఆశ్రమంలో పరిశీలించడానికి సరైన రికార్డులు లేవని అలాగే పరిశుభ్రతను పాటించడం లేదని మెనూ ప్రకారం ఆహారం అందించ డం లేదని అక్కడి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు అనాధాశ్రమానికి సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేసుకోలేదని వారిని మందలించారు, ఇకనుంచైనా రికార్డులను మెయింటైన్ చేస్తూ అనాధ ఆశ్రమాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

# ఆశా వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేసి పర్మినెంట్ చేయాలి- సిఐటియు






**కర్నూలు ప్రతినిధి మే 06 రిపబ్లిక్ న్యూస్**

కర్నూల్ నగరంలోని 23వ వార్డు శ్రీరామ నగర్ లో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్ దగ్గర మేడే వారోత్సవాలను పురస్కరించుకొని ఆశా వర్కర్లు మేడే కార్మిక సిఐటియు జెండాను ఆవిష్కరించారు. జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి ఎం. పద్మావతి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైనసిఐటియు నగర అధ్యక్షులు ఆర్.నరసింహులు పతాక ఆవిష్కరణ చేసి ఆశా వర్కర్లను ఉద్దేశించి మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలునిర్లక్ష్యంభావిస్తున్నాయి. దశలవారీగా సిఐటియు అనేక పోరాటాలు చేసిన సందర్భంగా కొన్ని డిమాండు లను పరిష్కరిస్తామని గతంలో వైయస్సార్ ప్రభుత్వం హామీ ఇచ్చింది. తర్వాత వచ్చిన తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఆశా వర్కర్ల ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని హామీ ఇచ్చి మాట తప్పింది. కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలి దానిని అమలు చేయడం లేదు. పని భద్రత కల్పించి ఆశా వర్కర్లను పర్మనెంట్ ఉద్యోగులుగా చేయాలి ఆరోగ్య రంగానికి నిధులు కేటాయించడం నిర్లక్ష్యం వహిస్తున్నారు కనీసం 6% అయినా నిధులు కేటాయించాలి ప్రభుత్వ రంగాలను ప్రైవేటు ధర్నా చేయకుండా ఆపాలి ప్రభుత్వమే వైద్య రంగాన్ని నడపాలి ఆశా వర్కర్లకు 10 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించి వారికి భద్రత కల్పించాలి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వారికి వర్తించే విధంగా చేయాలి కమ్యూనిటీ హెల్త్ వర్కర్లని ఆశలుగా మార్పు చేయాలి ఈ డిమాండ్ల సాధన కోసం మే నెల 20వ తారీఖున దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సిఐటియు పిలుపునివ్వడం జరిగింది. సార్వత్రిక సమ్మెలో ఆశా వర్కర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ వార్డు నాయకులు ఆశా వర్కర్లు పద్మావతి, నాగమణి బి నాగమ్మ ఏ వెంకటరమణమ్మ ఆశా బి శాంత కుమారి నరసమ్మ మొదలగు వారు పాల్గొన్నారు.

# ఆనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధురాలిని పరామర్శించిన ఎమ్మెల్యే..



**ఆలూరు ప్రతినిధి మే 6 (రిపబ్లిక్ న్యూస్)**



హాలహర్వి మండలం బాపురం గ్రామం లో ఆనారోగ్యంతో బాధపడుతున్న హనుమంతమ్మ ఆచారి పరామర్శించిన ఆలూరు వైసీపీబుసినే విరుపాక్షి ఈ కార్యక్రమం లో వైస్సార్సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల కన్వీనర్, జడ్పీటీసీ, ఎంపీపీ, కో కన్వీనర్, వైస్ ఎంపీపీ, సర్పంచ్ లు,ఎంపీటీసీ, పార్టీ అనుబంధం సభ్యులు, వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, బివీఆర్ అభిమానులు, వైస్సార్సీపీ కుటుంబం పాల్గొన్నారు.

# ఎంప్లాయిమెంట్ రిటర్న్సు సమర్పించాలి




**కర్నూలు ప్రతినిధి మే 06 రిపబ్లిక్ న్యూస్**

జిల్లా ఉపాధి కార్యాలయం కర్నూలు జిల్లాకు సంభందించిన పబ్లిక్, ప్రైవేటు ఎస్టాబ్లిష్మెంట్ ఎంప్లాయిమెంట్ రిటర్న్సు కోసం ఆన్లైన్ ద్వారా ప్రతి మూడు నెలలకు ఒకసారి మార్చి, జూన్, సెప్టెంబర్, డిసెంబర్, పంపాలని కోరినట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి. సోమ శివ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. **www.employment.ap.gov.in** వెబ్ సైట్ లో ఎంప్లాయిమెంట్ లాగిన్ ద్వారా ఎంప్లాయిమెంట్ రిటర్న్సు ను సమర్పించాలని కోరారు. ఎవైన సందేహాలు ఉంటే ఈ నంబరుని 9100598631 సంప్రదిన్చాలన్నారు.

# జిల్లా జైలు మరియు మహిళా జైలు తనిఖీ





**కర్నూలు ప్రతినిధి మే 06 రిపబ్లిక్ న్యూస్** లీలా వెంకట శేషాద్రి ,కార్యదర్శి, జిల్లా న్యాయ సేవాది కార సంస్థ, కర్నూల్ పురుషుల కేంద్ర కారాగారము మరియు మహిళ కారాగారామును తనిఖీ చేయడం జరిగినది. ఈ సందర్భంగా జడ్జి జైలు ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్ ను తనిఖీ చేసి "జైలు ఖైదీలకు ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్స్" గురించి వివరించారు. ఇందులో ఒక అడ్వకేట్, ఒక ప్యారా లీగల్ వాలంటీర్ ఉంటారని, వారు ఖైదీలకు న్యాయ సహాయాలు అందిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా జైలు లలో ఉన్న ఖైదీలు సత్ప్రవర్తనతో శిక్షను పూర్తి చేయాలని కోరారు.ఖైధి లకు ఎవరికైనా న్యాయవాదులు లేకుంటే ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని తెలిపారు. 70 ఏళ్ళ వయస్సు పై బడిన ఖైధిలకు, అనారోగ్యంతో బాధ పడే వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తామని త్వరగా బెయిల్ మంజూరు అయ్యేలా కృషి చేస్తామని తెలిపారు. ఖైధి లకు అందించే ఆహారాన్ని,రేషన్ ను వారి ఆరోగ్యం గురించి తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. ఖైధి లను కోర్ట్ వాయిదా లకు కచ్చితంగా హాజరు చెయ్యాలని ఆదేశించారు.ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కర్నూలు వారిని సంప్రదించవచ్చును అన్నారు, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 పై ప్రచారం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో జైలు అధికారులు, లాయర్ శివరాం మరియు ఖైదీలు పాల్గొన్నారు.

# ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ సర్కారు పనిచేస్తుంది

## - స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించండి - గత సర్కారు అప్పులపాలు చేసింది

**పెద్దపెల్లి జిల్లా ప్రతినిధి, మే 06( రిపబ్లిక్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్రాన్ని గత బిఆర్ఎస్ సర్కారు అప్పుల పాలు చేసిందని మన కాంగ్రెస్, ప్రజా ప్రభుత్వ సీఎం రేవంత్ రెడ్డి గాడిలో పెడుతున్నాడని ప్రజా సంక్షేమం కోసమే నిరంతరం శ్రమిస్తున్నామని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు. మంగళవారం రాత్రి కుక్కల గూడూరు గ్రామంలో నిర్వహించిన జై బాబు జై భీమ్ జై సమ్మేదాం సభను నిర్వహించి మాట్లాడారు బి ఆర్ ఎస్ రాష్ట్ర పాలనలో కాంగ్రెస్ పార్టీ నాయకులపై అనేక దాడులు జరిగాయని అక్రమ కేసులు బనయించారని ప్రజలను అనేక ఇబ్బందులకు గురి చేయడంతో టిఆర్ఎస్ పాలనను అంతం చేశారని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్ గుర్తు చేశారు కాంగ్రెస్ పార్టీ సర్కారు సీఎం రేవంత్ రెడ్డి పాలనలో అనేక సంక్షేమ పథకాలతో పాటు పేదవాడి గిన్నెలో సన్న బియ్యం అందిస్తున్నాడని ఇది దేశ చరిత్రలో మిగిలిపోయే అంశంగా మారిందని అన్నారు రామగుండం బి పవర్ హౌస్ పునర్నిర్మానం కొత్త ప్లాంట్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నామని సాధించి తీరుతామని రామగుండం పూర్వపు తొలి వెలుగులను మలగనివ్వనని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ అన్నారు తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన తర్వాత మన కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టి దేశానికి ఆదర్శవంతంగా నిలుస్తోందని ఆయన గుర్తు చేశారు ఇది నరేంద్ర మోడీ మెడలు వంచి జన గణన కొలగననా చేపట్టేలా మన కాంగ్రెస్ సర్కార్ చేసిందని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ అన్నారు పది సంవత్సరాలలో రైతులను అరగబోసా పెట్టిన టిఆర్ఎస్ నాయకులు రైతుల పక్షాన





యాత్ర చేపట్టడం సిగ్గుచేటని ఎద్దేవ చేశారు పాలకుర్తి అంతర్గాం మండలాల్లోని రైతాంగానికి సాగునీ రు అందేలా చర్యలు చేపట్టడం జరిగిందని అన్నారు కుక్కల గూడూరు గ్రామంలో 80% వరకు రైతులకు రుణమాఫీ జరిగిందని గుర్తు చేశారు రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ జెండానే తిరుగు లేకుండా ఎగరాలని ప్రతి కార్యకర్త నాయకుడు బాధ్యతగా కాంగ్రెస్ పార్టీ కోసం శ్రమించాలని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ అన్నారు. ఏఐసీసీ సభ్యులు ప్రభుత్వ ప్రధాన సలహాదారుహర్కర వేణుగోపాలరావు మాట్లాడుతూ సీఎం స రేవంత్ రెడ్డి సర్కారు ఎఐసిసి పెద్దలు సోనియాగాంధీ రాహుల్ గాంధీ నేతత్వంలో అనేక సంక్షేమ పథకాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా నిలుస్తోందని అన్నారు. అందరికీ అన్నం పెట్టే రైతు కుటుంబాలలో వెలుగులు పంచేందుకు నిరంతరం మన కాంగ్రెస్ పార్టీ సర్కారు పనిచేస్తుందని ముందున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అఖండ విజయం సాధించేలా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త సైనికులగా పనిచేయాలని పనిచేసే వాళ్లకు పార్టీ గుర్తింపు ఉంటుందని పార్టీ ఆదరిస్తుందని హర్కర వేణుగోపాలరావు అన్నారు సభకు ముందు పాలకుర్తి అంతర్గాంమండలాలకు మండలాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు ప్రజలు భారీ ర్యాలీ నిర్వహించారు ఈ సభ ర్యాలీ కార్యక్రమాలల పాలకుర్తి అంతర్గాం మండలాల పార్టీ అధ్యక్షులు గంగాధరి రమేష్ పెంద్రు హనుమాన్ రెడ్డి వర్కింగ్ ప్రెసిడెంట్ సింగం కరెంట్ గౌడ్ రామగుండం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గాలి పల్లి తిరుపతి మక్కాన్సింగ్ సేవా సమితి నిర్వాహకురాలు మనాలి ఠాకూర్ వైస్ చైర్మన్ మద్ది తిరుపతి గౌడ్ మాజీ ఎంపీపీ ఉలరిమెట్ల రాజలింగయ్య బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు పెంద్యాల మహేష్ కుక్కల గూడూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నిర్వాహకులు ప్రతినిధులు శ్రీపతి సురేష్ గౌడ్ మేడం బాపు శ్రీపతి సతీష్ గౌడ్ రెండు మండలాల కోఆర్డినేటర్ గాదె సుధాకర్ గొర్రె చందు నాగరాజు సంతోష్ కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు

# కోడుమూరు ఇంచార్జ్ విష్ణువర్ధన్ రెడ్డి ని సన్మానించిన కైలాష్ నాయక్..



**కర్నూలు ప్రతినిధి మే 06 రిపబ్లిక్ న్యూస్** కర్నూలు జిల్లా కోడుమూరు నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ ఇంచార్జ్ డి. విష్ణువర్ధన్ రెడ్డి ని గిరిజన లంబాడి హక్కుల పోరాట సమితి నాయకులు సన్మానించారు. సీనియర్ నాయకులు విష్ణు వర్ధన్ రెడ్డి గత నలవై సంవత్సరాలుగా ఎస్సీ ఎస్టీ బీసీలకు చేసిన సేవలను గుర్తించి కూటమి ప్రభుత్వం కేడీసీసీ బ్యాంకు చైర్మన్ పదవి ఇచ్చిందని గిరిజన లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కైలాష్ నాయక్ తెలిపారు. విష్ణు వర్ధన్ రెడ్డి కి పదవి రావడం సంతోషంగా ఉందని వారు విష్ణు వర్ధన్ రెడ్డి ని కలిసి సన్మానించారు. ఈసందర్భంగా కైలాష్ నాయక్ మాట్లాడుతూ సొసైటీ బ్యాంకుల్లో అసైన్డ్ భూమి రైతులకు సబ్సిడీ రుణాలు ఇచ్చేవారని గత ప్రభుత్వంలో ఆరుణాలను రద్దు చేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వం స్పందించి అసైన్డ్ భూముల రైతులకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలని కోరారు.

# ఎమ్మిగనూరు చేనేత వస్త్రాలకు గుర్తింపు తెచ్చేందుకు కృషి చేస్తా.. -రాష్ట్ర మంత్రి టిజి భరత్

**ఎమ్మిగనూరు,: ప్రతినిధి మే 06 (రిపబ్లిక్ న్యూస్)**

ఎమ్మిగనూరు చేనేత వస్త్రాలకు గుర్తింపు తెచ్చేందుకు తాను కృషి చేస్తానని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ అన్నారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని బనవాసిలో ఎంఎస్ఎంఈ మెగా టెక్స్ టైల్స్ పార్క్ శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రులు ఎన్.ఎం.డి ఫరూక్, సవితమ్మలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి టి.జి భరత్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో టెక్స్ టైల్స్ పార్క్ తీసుకొచ్చేందుకు ఎమ్మెల్యే బి.వి జయనాగేశ్వర్ రెడ్డి ఎంతో కృషి చేశారన్నారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్క్‌ను ఏర్పాటుచేసే దిశలో తమ ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. ఎమ్మిగనూరు ఎంఎస్ఎంఈ పార్కులో పరిశ్రమలు తీసుకొచ్చేందుకు తాను పూర్తిగా సహకరిస్తానన్నారు. ముందుగా ఎకో సిస్టం తయారుచేస్తే తర్వాత పరిశ్రమలు




తరలివస్తాయన్నారు. ఎమ్మిగనూరు చేనేత వస్త్రాలతో తయారుచేసే శాలువాలను టిటిడిలో ఉపయోగించుకునేలా మాట్లాడతానని చెప్పారు. తన శాఖలో సైతం వీటిని ఉపయోగిస్తానని చెప్పారు. తమ ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు అన్ని విధాలా కృషి చేస్తుందన్నారు. మరో రెండు దశాబ్దాల పాటు మా ప్రభుత్వం కొనసాగితే రాష్ట్రం దేశంలోనే అభివృద్ధి చెందిన రాష్ట్రాలలో ముందు వరుసలో ఉంటుందని మంత్రి టి.జి భరత్ చెప్పారు

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No./2023/87888



## శాన్విక పాలిమర్స్ వారి జాహ్నవి పివిసి పైప్స్ ఫ్యాక్టరీ ప్రారంభించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

**రిపబ్లిక్ న్యూస్కాకినాడ జిల్లా గండేపల్లి మే 6:** గండేపల్లి మండలం నీలాద్రి రావు పేట గ్రామంలో శివాలయం రోడ్డులో నూతనంగా నిర్మించిన శాన్విక పాలిమర్స్ వారి జాహ్నవి పివిసి పైప్స్ ఫ్యాక్టరీని జగ్గంపేట శాసనసభ్యులు, తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మా మిత్రులు స్వర్గీయ కొత్త నరసింహారావు కుమారుడు కృష్ణ చైతన్య నూతనంగా నిర్వహిస్తున్న పైపులు తయారీ మరింత అభివృద్ధి చెందాలని ఈ వ్యాపార రంగంలో ఉన్నత స్థాయికి ఎదగాలని దీవించారు. ఈ సందర్భంగా జాహ్నవి పివిసి పైప్స్ అధినేత కొత్త కృష్ణ చైతన్య మాట్లాడుతూ ఈ ఫ్యాక్టరీ ద్వారా తయారైన పైపులు గృహ అవసరాలకు, పరిశ్రమలకు, వ్యవసాయానికి నిత్యం,ఉపయోగించుకోవచ్చని ఫ్యాక్టరీ ధరల కె వినియోగదారులకు అందించడం జరుగుతుందని మా వ్యాపారానికి ఆశీస్సులు అందించిన ఎమ్మెల్యే నెహ్రూకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్, రాష్ట్ర ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు (కొండబాబు) ఎస్వీఎస్ అప్పలరాజు, పోతుల మోహనరావు, మారిశెట్టి భద్రం, కొత్త భైరవ కృష్ణ, కందుల చిట్టిబాబు, అడబాల భాస్కరరావు, కందుల బాబ్జి, కురుకూరి చౌదరి, తంగెళ్ల అప్పారావు, ఎంపీటీసీ గోవిందు, బొల్లం రెడ్డి రామకృష్ణ, చిట్యాల బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత సమ్మర్ క్యాంపును సందర్శించిన ఆర్ జెడి జి. నాగమణి



**కాకినాడ జిల్లా ప్రతినిధిమే 6' రిపబ్లిక్ న్యూస్:** కాకినాడ రూరల్ కరప మండలం నడకుదురు గ్రామంలో గల 5 నుంచి 15 సంవత్సరం లోపు ప్రభుత్వ ప్రైవేట్ బడులలో చదువుచున్న విద్యార్థులకు ఉచిత సమ్మర్ క్యాంపును నిర్వహిస్తున్నామని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వాకాడ వెంకటరమణ చిన్న మాస్టర్ పేర్కొన్నారు. పాఠశాల సంయుక్త సంచాలకులు ఆర్ జె డి జి నాగమణి, ఈరోజు సమ్మర్ క్యాంపు ను విజిట్ చేశారని, ఇప్పటివరకు 83 మంది విద్యార్థులకు సమ్మర్ క్యాంపుని సద్వినియోగం చేసుకున్నారని హెచ్ఎం తెలియజేశారు. ఆర్ జెడి నాగమణి మాట్లాడుతూ ఇటువంటి సమ్మర్ క్యాంపులు ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తుండడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఇటువంటి సమ్మర్ క్యాంపుల వలన విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో జాయిన్ అవ్వడానికి ఆకర్షితులవుతారని, తల్లితండ్రులు అందరూ ప్రభుత్వం ఇచ్చే వివిధ పథకాలు, ప్రయోజనాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో జాయిన్ చేయాలని ఆమె కోరారు. పిల్లి గోవిందరాజులు స్టేట్ అవార్డు మాస్టర్ పెప్పెట్ షో చేసి విద్యార్థులను తల్లిదండ్రులను ఆలోచింపచేసేలా, ఆనందపరిచారు. ఎంఈఓ 2 పి సత్యనారాయణ తల్లిదండ్రులను నాణ్యమైన విద్యను అందించే మాపై బాధ్యత ఉందని భరోసా ఇచ్చారు. విజయలక్ష్మి టీచర్ డ్రాయింగ్,ఆర్ట్, టీచర్లు, సీఆర్పీలు వారు విద్యార్థులచే తయారు చేయించిన వివిధ ఆర్ట్ క్రాఫ్ట్ బొమ్మలను ప్రదర్శించారు. అనంతరం సుకన్య సమృద్ధి యోజన పథకం ద్వారా30 మంది బాలికలకు వాకాడ వెంకటరమణ( చిన్న మాస్టర్) తన సొంత డబ్బులతో కట్టిన పథకం పాస్ బుక్ లను ఆర్ జెడి నాగమణి చేతుల మీదగా అందజేశారు. సామాజిక సేవలో ముందున్న వాకాడ వెంకట రమణ మాస్టారును ఆర్జెడి నాగమణి ప్రసంసించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మెండు గోవిందరాజు, ఎస్ఎంసి చైర్మన్, పి ఆర్ టి యు పోలినాటి నాగేశ్వరరావు, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామస్థాయి నుండి జిల్లాస్థాయి వరకు అధికారులు సమన్వయంతో పనిచేయండి

### స్వర్ణాంధ్ర@2047 సాధించుకోవచ్చు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ




**కాకినాడ జిల్లా ప్రతినిధి మే 6, రిపబ్లిక్ న్యూస్**
గండేపల్లి మండలం జడ్ రాగంపేట పరిణయ ఫంక్షన్ హాల్ లో జగ్గంపేట శాసనసభ్యులు, టీటీడీ బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ అధ్యక్షతన జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి ప్రణాళిక తయారుచేయు నిమిత్తం జిల్లాస్థాయి అధికారులు, నియోజకవర్గంలోని నాలుగు మండలాల స్థాయి అధికారులు, గ్రామస్థాయి అధికారులతో నియోజవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి జాతీయ గీతం ఆలపించారు. అనంతరం నియోజవర్గ అభివృద్ధి ప్రణాళిక తయారు చేయు విధానం గురించి వ్యవసాయ శాఖ, నీటిపారుదల శాఖ, పశు సంవర్ధక శాఖ, ఉద్యానవన శాఖ, పారిశ్రామిక శాఖ, ఆరోగ్యశాఖ, స్త్రీ,శిశు సంక్షేమ శాఖ, మత్స్యశాఖ, స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర శాఖ, పి ఫోర్ కార్యక్రమం, విద్యుత్ శాఖ, విద్యాశాఖ, పంచాయతీరాజ్ శాఖ, రోడ్లు, భవనాల శాఖ, జాతీయ గ్రామీణ ఉపాధి పథకం శాఖ, గృహ నిర్మాణ శాఖల యొక్క పనితీరు, ప్రణాళికలపై విశ్లేషణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అన్ని శాఖల అధికారులతో ఒక్కొక్క విభాగంతో జ్యోతుల నెహ్రూ ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా ఒక నియోజకవర్గంలో జిల్లా స్థాయి నుండి గ్రామస్థాయి వరకు అధికారులతో నియోజవర్గ అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడానికి అవగాహన సదస్సు నిర్వహించి చరిత్ర సృష్టించామని అన్నారు. మీరందరూ సమన్వయంతో గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు అన్ని విభాగాలు అభివృద్ధి ప్రణాళికలు రూపొందించి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని తెలియజేశారు. గ్రామస్థాయి నుంచి ఏ అధికారికైనా నాకు ఫోన్ చేసి సమస్యలు వివరించవచ్చని వాటిని పరిష్కరించడానికి నా వంతు సహాయ సహకారాలు అందిస్తారని ఎమ్మెల్యే నెహ్రూ అన్నారు. అనంతరం అన్ని విభాగాల వారు జ్యోతుల నెహ్రూ ను సత్కరించి ఆయన నిర్వహించిన ఈ కార్యక్రమం పై ప్రశంసలు కురిపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు తోట రవి, అత్తులూరి నాగబాబు, తోట గాంధీ ఎస్వీఎస్ అప్పలరాజు, ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, పుష్కర చైర్మన్ అడబాల భాస్కరరావు, ఏలేరు చైర్మన్ బస్వా వీరబాబు, మండల అధ్యక్షులు పోతుల మోహనరావు, మారిశెట్టి భద్రం, చదరం చంటిబాబు, క్లస్టర్ ఇన్చార్జిలు, జిల్లా స్థాయి అధికారులు, నియోజవర్గంలో నాలుగు మండలాల ఎమ్మార్వోలు, ఎంపీడీవోలు, మండల వ్యవసాయ అధికారులు, ఏపీవోలు, విద్యుత్ శాఖ అధికారులు, ప్రభుత్వ వైద్యులు, వెటర్నరీ డాక్టర్లు, అంగన్వాడి, గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు దాదాపు 1000 మంది అధికారులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం భారీ చేరికలు



**కాకినాడ జిల్లా ప్రతినిధిమే 6, రిపబ్లిక్ న్యూస్:** .ఓవైపు సంస్థాగతంగా బలమైన శక్తిగా నిలదొక్కుకున్న తుని నియోజకవర్గ తెలుగుదేశం పార్టీలోకి వలసలు పరంపర కొనసాగుతోంది.అగ్రనేత యనమల నాయకత్వంలో చక్కని సుపరిపాలన అందిస్తున్న ప్రభుత్వ విఫ్ యనమల దివ్య వెంట నడిచేందుకు విపక్ష కార్యకర్తలు సైకిల్ ఎక్కేందుకు ఉత్సాహం చూపుతున్నారు.సీనియర్ నేత యనమల రాజేష్ సూచనలకు అనుగుణంగా మండల టిడిపి అధ్యక్షుడు చొక్కా అప్పారావు సారధ్యంలో కోనంతా ఒక్కటౌవుతోంది.ఈనేపథ్యంలో తొండంగి మండలంలో పలువురు టీడీపీలో చేరుతున్నారు.మండలటీడీపీ అధ్యక్షుడు చొక్కా అప్పారావు, మహంకాళి,కొయ్యా మల్లేష్, చొక్కా శివాజీ ఆధ్వర్యంలో రామారావు పేటకు చెందిన వంద మంది టీడీపీలో చేరారు.వీరందరికీ పసుపు కండువాలు వేసిన యనమల రామకృష్ణుడు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో జయభేరి మోగించాలని సమిష్టి నిర్ణయాలతో గ్రామాభివృద్ధికి బాటలు నేర్చుకోవాలన్నారు.ఇవాళ దోనే సత్తిబాబు,దోనే నూకరాజు తిక్కా అశోక్, గాలి రాజు,గోసల దేవుడు,గోసల రాజు,అర్జల్లి సూరిబాబు,తిక్కాల కాశీరావు,మైలపల్లి చినబాబులు,గోసల ప్రసాద్, చొక్కా పెద కొత్తయ్యతో పాటు సుమారు వందమంది టీడీపీలో చేరారు

## ఆశా వర్కర్లకు ఒప్పంద జీవోలు తక్షణమే విడుదల చేయాలి






**కాకినాడ జిల్లా ప్రతినిధి మే 6 రిపబ్లిక్ న్యూస్**
ఒప్పంద జీవోలు అమలు చేయాలని నియమకాలను ప్రభుత్వమే చేపట్టాలని లేబర్ కోడ్స్ రద్దు చేయాలని చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని ఆశా వర్కర్లకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాల పిలుపుమేరకు మే నెల 20వ తేదీన దేశవ్యాప్త సమ్మెలో ఆశా వర్కర్స్ జిల్లా వ్యాప్తంగా పాల్గొంటామని తెలియజేస్తు ఈరోజు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారులు డాక్టర్ నరసింహ నాయక్ ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది . ఈ సందర్భంగా ఆశా వర్కర్సయూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమళ్ల పద్మ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఆశా వర్కర్లందరూ మే నెల 20వ తేదీన దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటామని ఆశా వర్కర్ లందరికీ రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన హామీలు తక్షణమేఅమలు చేయాలని ఒప్పంద జీవోలు వెంటనే విడుదల చేయాలని కనీస వేతనం 26,000 ఇవ్వాలని ఈ నెలలో మొదటి మంగళవారం జరిగే ఆషాడేలోనుండి నల్ల రిబ్బన్లతో నిరసన తెలపడం జరిగిందన్నారు ఈరోజు నుండి ఒప్పంద జీవోలు అమలు అయ్యేంతవరకు కూడా ఆశా వర్కర్లు నిరసన తెలియజేస్తూ వర్క్ లో ఉంటామని తెలిపారు దేశవ్యాప్తంగా కార్మికులను యజమానులకు కట్టు బానిసలుగా మార్చే లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని , ప్రభుత్వ రంగ సంస్థలు పరిరక్షించాలని ఆరోగ్య రంగానికి జీడీపీలో ఆరు శాతం నిధులు కేటాయించాలని ఆశ వర్కర్లను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని ఒప్పంద జీవోలు తక్షణమే అమలు చేయాలని చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించి సంక్షేమ పథకాల అమలు చేయాలని అన్నారు గత 20 సంవత్సరాల నుండి పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తూ కీలక పాత్ర పోషిస్తున్నారు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించకుండా నిర్లక్ష్యంగా రిటైర్మెంట్ చేయడం తగదన్నారు రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్లకు వరాల జల్లు అని పేపర్లు టీవీలకు ప్రకటనలు ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించిన ప్రభుత్వం గుర్తించలేకపోవడం దారుణం అన్నారు

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆశా వర్కర్స్ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఒప్పంద జీవోలు అమలు అయ్యేంతవరకు మా నిరసన కొనసాగుతూనే ఉంటాదని తెలిపారు కార్మిక సంఘాల పిలుపులో భాగంగా మే 20వ తేదీన దేశవ్యాప్త సమ్మెలో జిల్లా వ్యాప్తంగా ఆశ వర్కర్లందరూ పెద్ద ఎత్తున పాల్గొని దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో చెక్కల వేణి, మలక నాగలక్ష్మి, ఎస్ లక్ష్మి, సుజాత, గంగాభవాని, తదితరులు పాల్గొన్నారు

1) లేబర్ కోడ్స్ రద్దు చెయ్యాలి కార్మిక చట్టాలు పటిష్టం చేయాలి
2) కార్మికులుగా గుర్తించి కనీస వేతనం ఇవ్వాలి పర్మినెంట్ చేయాలి
3) ఒప్పంద జీవోలు ఇవ్వాలి చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలి
4) నియమకాలు ప్రభుత్వమే చే పట్టాలి
5) సంక్షేమ పథకాలు అమలు చేయాలి
6) ఆరోగ్య రంగానికి జిడిపిలో ఆరు శాతం నిధులు కేటాయించాలి
7) ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, అమ్మకాన్ని ఆపాలి ప్రజా సంపదను కాపాడాలి
8) 10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి

## ఎన్టీఆర్ బీచ్ ను శుభ్రం చేసిన రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ




**కాకినాడ జిల్లా ప్రతినిధిమే 6 ' (రిపబ్లిక్ న్యూస్)** కూటమి నాయకులు, జనసేన శ్రేణులు, స్వచ్ఛంధ సంస్థల సభ్యులు, పారిశుధ్య కార్మికులతో కలిసి పరిశుభ్రం చేశారు. బీచ్ లో పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు పంతం నానాజీ మాట్లాడుతూ మూడు రోజులు పాటు బీచ్ లో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించిన నేపద్యంలో బీచ్ లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి తిరిగి పరిశుభ్రమైన బీచ్ ను ప్రజలకు అందుబాటులో ఉంచాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. భవిష్యత్ లో కాకినాడ బీచ్ ను మరింత సుందరీకరణ చేసి అభివృధి చేస్తామన్నారు.ఈ కార్యక్రమం లో స్థానికులు, జనసేన నాయకులు, కూటమి నాయకులు, వీరమహిళలు పాల్గొన్నారు

## మహిళల సంరక్షణనే కూటమి ప్రభుత్వ ధ్యేయం

### : ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి.




ఉచిత కుట్టుమిషన్ ల కేంద్రం ప్రారంభిస్తున్నా ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి

**రిపబ్లిక్ న్యూస్-(మే 6)గడివేముల :**
మహిళలు స్వయం ఉపాధితో రాణించాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన గడివేములలో బీసీ కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్ సహకారంతో మండల పొదుపు ఐక్య సంఘం భవనములో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి మంగళవారం నాడు ప్రారంభించారు. ఈ సందర్భంగా గౌరు చరిత రెడ్డి మాట్లాడుతూ మహిళల సంరక్షణనే ధ్యేయంగా వారికి స్వయంగా ఉపాధి కల్పించడం లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలలో మహిళలకు పెద్దపీట వేస్తూ అభివృద్ధిలో భాగంగా.ఈ ఉచిత కుట్టుమిషన్ శిక్షణ సుమారు వంద రోజులు ఉంటుందని అన్నారు. ప్రభుత్వం ట్రైనర్ని ఏర్పాటు చేసి మొదటి విడతగా ఉదయం 50 మంది, మధ్యాహ్నం 50 మంది కి శిక్షణ ఇస్తున్నారని, శిక్షణ కు 75శాతం హాజరున్న వారికీ ఎడు వేల రూపాయల విలువగల కుట్టు మిషన్ ని ఉచితంగా ప్రభుత్వం అందిస్తుందన్నారు. మొదటి బ్యాచ్ శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత రెండు, మూడు బ్యాచులు కూడా ఉంటాయన్నారు.కూటమి ప్రభుత్వం లో ప్రతి ఇంటినుండి ఒక పారిశ్రామిక వ్యక్తిని తయారు చేయడం చంద్రబాబు ధ్యేయం అన్నారు.ఈ కార్యక్రమం లో బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ రాజు, తహసీల్దార్ వెంకట రమణ, ఎంపీడీఓ వాసుదేవగుప్తా, ఏపీఎం నాగరాజు, మండల టీడీపీ కన్వీనర్ దేశం సత్యనారాయణ రెడ్డి, మాజీ ఎంపీపీ వంగాల శ్రీనివాస రెడ్డి, కరిమద్దెల ఈశ్వరరెడ్డి, సోషల్ మీడియా కోఆర్డినేటర్ బత్తుల సుభద్రమ్మ, ఒడ్డు లక్ష్మీదేవి, కృష్ణ యాదవ్, శ్రీనివాస యాదవ్, రాజు నాయక్, గంగాధర్ రెడ్డి,టీడీపీ నాయకులు, కార్యకర్తలు, కుట్టుమిషన్ శిక్షణ తీసుకుంటున్న మహిళలు పాల్గొన్నారు.

# పరమ పవిత్ర పతివ్రతా మూర్తి సీతామాత

### మాళిగి పావని విశ్వ హిందూ పరిషత్ జిల్లా మాతృశక్తి కో- కన్వీనర్



**కర్నూలు ప్రతినిధి మే 6(రిపబ్లిక్ న్యూస్)**
విశ్వహిందూ పరిషత్ మాతృశక్తి ఆధ్వర్యంలో ఈరోజు ఉదయం 11 గం.లకు ఉల్చాల వై రోడ్డు జంక్షన్ వద్ద గల వాసవి నగర్ లో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో "సీతానవమి" సందర్భంగా సీతారాముల పూజ కార్యక్రమం విశ్వహిందూ పరిషత్ జిల్లా సహ సత్సంగ కన్వీనర్ కృష్ణ పరమాత్మ ఆధ్వర్యంలో నిర్వహించారు అనంతరం ముఖ్య వక్తగా విచ్చేసిన విశ్వహిందూ పరిషత్ మాతృశక్తి జిల్లా కో కన్వీనర్ పావని మాట్లాడుతూ%ౌ%మహర్షి వాల్మీకి రచించి నభారతీయ జీవన గ్రంథం శ్రీమద్రామాయణం ఆ రామాయణంలో సామాన్య మానవ జీవనం ఆదర్శవంతంగా ఎలా ఉండాలో నేర్పించినదనీ, భార్యాభర్తల అనుబంధం ఎలా ఉండాలో సుస్పష్టంగా రామాయణ మహాగ్రంథం తెలియజేసిందని అన్నారు. మహా పతివ్రత అయిన సీత తన జీవితాన్ని మొత్తం శ్రీరామునికే అంకితం చేసిందని చిన్నప్పుడే అప్రతిహత శక్తిమంతురాలై శివధనస్సును వంటి చేత్తో కదిలించిన ఆమె అంతే అణుకువతో శ్రీరాముని భార్యగా జీవనాన్ని కొనసాగించింది. 14 సంవత్సరాలు వనవాసం అనుభవించడానికి సిద్ధపడిన రాముని తో పాటు వనవాసానికి తానూ వస్తానని అనగా సీత నువ్వు రాజపుత్రికవు,సుకుమారి వి నారచీరలు ధరించి,అడవిలో కందమూలాలు తింటూ కాలినడకన ప్రయాణిస్తూ జీవించాలని అందువల్ల నీవు ఐయోధ్యలోనే నివశించమన్న శ్రీరాముని మాటకు సీతాదేవి ప్రభూ భర్త ఎక్కడో భార్య కు అక్కడే స్వర్గం,రాజప్రాసాదం, అన్న మాటతో తన పాతివ్రత్యాన్ని ప్రదర్శించిందని,నేటి హిందూ మహిళలు కూడా భర్త కష్టసుఖాల్లో పాలుచుకుంటూ సంసారాన్ని ,పిల్లలను వృద్ధిలోకి తేవాలన్న సందేశం రామాయణంలోని సీతామాత ద్వారా తెలుసుకోవాలని తెలియజేశారు.ఈకార్యక్రమంలో శారద,హేమలత,ఇతర మాతృమూర్తులు పాల్గొన్నారు

# మనసుకవి ఆచార్య ఆత్రేయ

## నేడు జయంతి సందర్భంగా నివాళి

విజయవాడ,**మే 06, రిపబ్లిక్ న్యూస్ :-**ఆచార్య ఆత్రేయ తెలుగు వారికి సుపరిచతమైన సినీ కవి. ఆయన ఎన్నో అందమైన పాటలను, విరహగీతాలను రచించి మెప్పుపొందారు. ఆత్రేయుడు అంటే చంద్రుడు అని కూడా అర్థం. మబ్బుల చాటున చందమామ దోబూచులాడినట్లు ఆత్రేయ రాసిన కొన్ని సినిమా పాటల వెనుక ఆయన ఆంతర్యాన్ని, అనుభవాన్ని, అన్వేషణలు కలబోసి ఉంటాయి. సినిమా పాటల్లో తేలికైన పదాలతో ఎంత బరువైన భావాలనైనా పలికించిన ఆత్రేయను సినీ వేమన అనొచ్చు. అలాగే జీవితంలో ఎన్నో ఎత్తుపల్లాను చవిచూసిన ఆత్రేయను 'అపర శ్రీనాథుడు' అని కూడా అనొచ్చు. ఆత్రేయ తనకు ఎదురైన అనుభవాలను పాటల్లో పొదిగి, తన గుండె బరువును దించుకున్నట్లుగా కూడా కొందరు పెద్దలుచెబుతారు. మనసుకవిగా ముద్ర వేసుకున్న ఆచార్య ఆత్రేయ పూర్తి పేరు 'కిళాంబి వేంకట నరసింహాచార్యులు'. పేరులో ఆచార్యని, గోత్రంలోని



ఆత్రేయను తీసుకొని 'ఆచార్య ఆత్రేయ' అని పెట్టుకున్నారాయన. 1921 మే 7, నెల్లూరు జిల్లా, సూళ్లూరుపేట మండలం, మంగళంపాడు గ్రామంలో సీతమ్మ, కృష్ణమాచార్యులకు జన్మించారు. భక్తిరస ప్రధానంగానూ ఆత్రేయ కలం అద్భుతాలు సృష్టించింది. శేషశైలావాస శ్రీవెంకటేశా అంటూ ఆయన శ్రీనివాసుడికి జోలపాడిన విధం మరిచిపోలేనిది. శ్రీ వెంకటేశ్వర మహత్యం చిత్రంలోని ఈ పాట అప్పటికీ ఇప్పటికీ ఎప్పటికీ.. విన్న వెంటనే శ్రీవారి చెంతకు పట్టుకెళ్లిపోతుంది. మనసు గతి ఇంతే మనిషి బతుకు ఇంతే మనసున్న మనిషికీ సుఖము లేదంతే అంటూ ఆయన కలం నుంచి ఎన్నో ఆణిముత్యాలు జాలువారాయి. తక్కువ మాటలతో ఎక్కువ భావాలను పలికించడంలో ఆత్రేయ దిట్ట. ఆయన పాటలు తెలుగు సినిమాను కొత్త పుంతలు తొక్కించాయి. ప్రేక్షకుడ్ని సినిమాలో మమేకమయ్యేలా చేయడంలో ఆయనకాయనే సాటి.1989, సెప్టెంబర్ 13.. ఎందరో సినీ అభిమానులను విషాదంలో ముంచుతూ ఈ లోకాన్ని విడిచివెళ్లారు ఆత్రేయ. మనసుతో ఆయన పలికించిన భావాలకు ఆచార్యత్వం వహించారు. కనుకనే ఆచార్య ఆత్రేయ అయ్యారు. ఆయన కలం మూగపోయినా పాటలు ఆగవు. ఆ పాటలు ఆగినా అందులోని రాగాలకు అంతం లేదు. వాటిలో పలికించిన భావాలకు మరణం లేదు. ఆత్రేయ ఆగని మనోభావాల ఉధృతికి చెరగని ముద్రలాంటి వారు. ఇందులో అనుమానం లేదు.

# సిఆర్‌డిఏ సమావేంలో కీలక నిర్ణయాలు

**మంత్రుల కమిటీలోనూ పలు అంశాలపైచర్చ -ఆయా సంస్థలకు భూ కేటాయింపులకు నిర్ణయం**

**వివరాలు వెల్లడించిన మంత్రి నారాయణ**

అమరావతి**మే 06, రిపబ్లిక్ న్యూస్ :-**

అమరావతిలో ఇప్పటి వరకు 1050 ఎకరాల మేర వివిధ సంస్థలకు భూకేటాయింపులు జరిగాయని మంత్రి నారాయణ తెలిపారు. సీఆర్డీఏ 47వ సమావేశానికి ముందు మంత్రుల కమిటీ- సమావేశమై భూకేటాయింపులపై నిర్ణయం తీసుకున్నదని అన్నారు. ఆ నిర్ణయాలను మంత్రి నారాయణ మీడియాకు వెల్లడించారు. లా యూనివర్సిటీకి 50 ఎకరాలు, క్వాంటం వ్యాలీకి 50 ఎకరాలు, బసవ తారకం ఆస్పత్రికి అదనంగా మెడికల్ కాలేజీకి 6 ఎకరాలు, ఆదాయపు పన్ను శాఖకు 0.78 ఎకరాలు, రెడ్‌క్రాస్ సొసైటీకి 0.78 ఎకరాలు, కోస్టల్ బ్యాంక్‌కు 0.40 ఎకరాలు, ఐఆర్‌సీటీసీకి ఎకరం భూమిని కేటాయిస్తూ మంత్రుల కమిటీ- నిర్ణయం తీసుకున్నట్లు- తెలిపారు. ఏపీ కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో జరిగిన కీలక నిర్ణయాలను మంత్రి నారాయణ వెల్లడించారు. సీఆర్డీఏ 47వ ఆథారిటీతో పాటు గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ సమావేశం కూడా జరిగిందన్నారు. 2014-19లో గెజిటెడ్ ఆఫీసర్స్ క్వార్టర్స్ కు సంబంధించి రూ. 514 కోట్ల టెండర్లకు సీఆర్డీఏ ఆమోదం తెలిపింది.. నాన్ గెజిటెడ్ ఆఫీసర్ల క్వార్టర్లకు సంబంధించిన టెండర్లకు సైతం సీఆర్డీఏ ఆమోదం తెలిపింది.. సీడ్ యాక్సిస్ రోడ్ లో ఆదనపు రోడ్ల టెండర్లకు కూడా సీఆర్డీఏ ఆమోదించింది.. అలాగే, నాన్ గెజిటెడ్ 9 టవర్లకు 506.67 కోట్ల రూపాయలు.. మరో 12 టవర్లకు రూ. 517 కోట్లకు సీఆర్డీఏ ఆమోదం తెలపగా.. మొత్తం రూ. 1732.31



కోట్ల టెండర్లకు సీఆర్డీఏ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇక, మంత్రివర్గ ఉపసంఘం లా యూనివర్సిటీకి 55 ఎకరాల భూ కేటాయింపులు చేసినట్లు నారాయణ చెప్పారు. క్వాంటం వ్యాలీకి 50 ఎకరాలు, బసవతారకం క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ మెడికల్ కళాశాల కోసం 15 ఎకరాలకు అదనంగా మరో 6 ఎకరాలు కేటాయించినట్లు మంత్రి నారాయణ తెలిపారు. అలాగే, కోస్టల్ బ్యాంక్ కు 0.4 ఎకరాలు, ఐఆర్సీటీసీకి ఎకరం, ఇన్కమ్ టాక్స్ కి 0.78 ఎకరాల భూమి కేటాయించినట్లు- పేర్కొన్నారు. అయితే, మొత్తం 7 సంస్థలకు మంగళవారం స్థలాల కేటాయింపు చేశామన్నారు. అంతకు ముందు 64 సంస్థలకు కేటాయింపులు చేయగా.. మొత్తం 71 సంస్థలకు 1050 ఎకరాల భూమి ఇవ్వడం జరిగిందని మంత్రి నారాయణ వెల్లడించారు. గెజిటెడ్ అధికారుల నివాస భవనాలను రూ. 514 కోట్లతో నిర్మాణం చేపడతామని నారాయణ వెల్లడించారు. వాటిలో అదనపు మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ. 194 కోట్లు- మంజూరు చేసేందుకు సీఆర్డీఏ అనుమతి ఇచ్చిందన్నారు. తొమ్మిది టవర్లలో నాన్ గెజిటెడ్ అధికారుల నివాసాలు, మౌలిక సదుపాయాలకు అనుమతి సైతం ఇచ్చిందని తెలిపారు. మంగళవారం జరిగిన సీఆర్డీయే 47వ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అంతకు ముందు జీవోఎం కూడా సమావేశమై.. రాజధానిలో భూ కేటాయింపులపై పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. అందుకు సంబంధించిన వివరాలను మంత్రి నారాయణ వెల్లడించారు. రూ. 517 కోట్లతో టెండర్లకు అనుమతి ఇచ్చిందని చెప్పారు. మొత్తంగా రూ. 1732. 31 కోట్లకు అనుమతి ఇచ్చినట్లు- తెలిపారు. అలాగే 190 ఏంఎల్డీల వాటర్ ట్రీటెమెంట్ ప్లాంట్ ఏర్పాటుకు రూ. 568. 57 కోట్లతో టెండర్ పిలిచామన్నారు. 15 ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం చేపట్టాలని నిర్ణయం తీసుకున్నట్లు- చెప్పారు. అందుకు రూ. 494 కోట్లతో పనులు చేపట్టేందుకు అనుమతి ఇచ్చిందన్నారు. ఇక 3. 5 కిలోమీటర్ల ఈ3 రోడ్డు ఎలివేటెడ్ రోడ్డుకు సైతం అనుమతి ఇచ్చిందని ఆయన వివరించారు. ఈ 15,13 రహదారులను జాతీయ రహదారికి అనుసంధానం చేసేలా నిర్ణయం తీసుకున్నామన్నారు. వీటిని రూ.70, రూ.387 కోట్లలో చేపట్టేందుకు అనుమతి ఇచ్చిందని తెలిపారు. జీవోఎంలోనూ వివిధ సంస్థలకు భూ కేటాయింపులు చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. గతంలో 64 సంస్థలకు భూ కేటాయింపులు జరిగాయని చెప్పారు. ఇప్పటి వరకూ రాజధాని ప్రాంతంలో 1050 ఎకరాల మేర భూ కేటాయింపులు జరిగాయని మంత్రి పి.నారాయణ వివరించారు.

# అష్టదిగ్బంధనతో పాక్ ఉక్కిరిబిక్కిరి !

**మే 06, రిపబ్లిక్ న్యూస్ :-**

యుద్ధమంటే నేరుగా పోరాటమొక్కటే కాదు...శత్రువును అష్టదిగ్బంధనం చేసి కదలకుండా చేయడం కూడా యుద్ధంలో ఓ భాగమే. పాక్ పరిస్థితి ఇప్పుడు అలాగే ఉంది. అది నిద్రలేని రాత్రులు గడుపుతోంది. ప్రపంచ దేశాలు నమ్మలేని దుస్థితిలో కొట్టుమిట్టాడుతోంది. నిజంగానే యుద్ధం జరిగితే దాని పక్కన నిలబడానికి ఒక్కదేశం కూడా రాకపోవచ్చు. ఇప్పటికే అనేక రకాలుగా భారత్ పాక్‌ను ముప్పుతిప్పలు పెడుతోంది. పహల్గామ్ దాడి జరిగి పక్షం రోజులు పూర్తయ్యాయి. ఇంకా ఎప్పుడు దాడి చేస్తారని కొందరు అధికారంలో ఉన్న బిజెపిని నిలదీసే ప్రయత్నంలో ఉన్నారు. ఇలాంటి వారు యుద్ధతంత్రం గురించి తెలుసుకుంటే మంచిది. సామ,భేద, దాన, దండోపాయాలు అన్నవి యుద్ధంలో బాగా వాడే పదాలు. మొదటి మూడు విఫలమైన తరవాతనే నాలుగోది అయిన దండోపాయం చేపట్టాలి. రావణుడు యుద్ధానికి సై అన్న తరుణం లోనూ అతడి పట్టపుమహిషి మండోదరి అడ్డుపడి సామ,భేద,దాన,దండోపాయల గురించి వివరిస్తుంది. రాముడిని మచ్చిక చేసుకుని బతిమాలి, బామాలి, క్షమించమని వేడుకొమ్మని అంటుంది. చేసిన తప్పును సరిదిద్దుకోమని హెచ్చరిస్తుంది. కానీ రావణుడు ఇవన్నీ మరచి యుద్ధంచేసి పారజితుడు అయ్యాడు. పాక్ కూడా ఉగ్రవాదం ఎగదోసే ప్రయత్నం నుంచి బయటపడి, తన ఉనికిని గుర్తించాలి. భారత్ నుంచి విడిద్ద ముక్కని గుర్తించాలి. అలా జ్ఞానోదయం కావాలి. అప్పుడే పాక్ ప్రపంచదేశాల్లో మనగలుగుతుంది. కానీ అలా చేయలేక ఉగ్రవాదాన్ని ఎగదోస్తూ తమదేశ ప్రజలను మభ్య పెడుతూ వస్తోంది. ఇప్పుడు పాపం పండింది. ఇంతకాలం ఒక లెక్క.ఇప్పుడో లెక్క. పహల్గామ్ దాడి తరవాత ఇప్పుడు భారత్ విసిరిన ఉచ్చులో పడి గిలగిల కొట్టుకుంటోంది. మోడీ కూడా ఇప్పుడు అదే వ్యూహంతో సాగుతున్నారు. ఇప్పటికే పాక్ యుద్ధభయంతో సైన్యాన్ని మోహరించింది. ఉగ్రవాద శిబిరాలను ఖాళీ చేయించింది. గగనతలంపై ఆంక్షలు విధిచడంతో పాక్ ముప్పు తిప్పలు పడుతోంది. అసలే పాక్ ఆర్థిక వ్యవస్థ అంతంతమాత్రంగా సాగుతున్న వేళ..పాక్‌ను అష్టదిగ్బంధనం చేయడంతో నానా ఇక్కట్లు పడుతోంది. మరోవైపు సింధుజలాల రాకను అడ్డుకుంది. దీంతో నీటి కోసం తపిస్తున్నారు. అలాగే పివోకెపై దాడి చేస్తారన్న భయంతో అక్కడ బలగాలను



మోహరించారు. ఇకపోతే ఐక్యరాజ్యసమితలో కూడా తాజాగా పాక్‌కు చుక్కెదురయ్యింది. అంతర్జాతీయంగా కూడా భారత్ బలమైన మద్దతును కూడా గట్టింది. ఇవన్నీ కూడా పాక్‌ను దెబ్బతీస్తున్న ఘటనలుగానే చూడాలి. యుద్ధంలో ఇదొక భాగంగా చూడాలి. ఇలా చేయడం వల్ల అసలు యుద్ధంలో పాక్ అడుగు వేయలేని దుస్థితికి చేరుకుంది. పహల్గాంలో ఉగ్రదాడి ప్రతి భారతీయుని హృదయాన్ని తీవ్రంగా గాయపరిచింది. బాధితుల కుటుంబాల పట్ల ప్రతి భారతీయుడూ తీవ్ర సానుభూతి వ్యక్తం చేస్తున్నాడు. ఏ రాష్ట్రానికి చెందినవారైనా,ఏ భాష మాట్లాడేవారైనా ఆ ఉగ్రదాడిలో తమ ఆత్మీయులను కోల్పోయిన వారి బాధను అనుభవిస్తున్నారు. ప్రతి భారతీయుని రక్తం మరిగిపోతోంది. పాక్‌ను తుదముట్టించా లని ప్రతి ఒక్క భారతీయముడు కోరుకుంటున్నాడు. నిజానికి 370 ఆర్టికల్ రద్దు తరవాత కశ్మీర్‌లో మళ్లీ ప్రశాంత పరిస్థితులు నెలకొంటున్నాయి. పాఠశాలలు, కళాశాలలు కళకళలాడుతున్నాయి. విద్యావాతావరణం మళ్లీ చిగురించింది. నిర్మాణ రంగ కార్యకలాపాలు, అభివృద్ధి కార్యకలాపలు గతంలో ఎప్పుడూ లేని విధంగా వేగం పుంజుకున్నాయి. ప్రజాస్వామ్యం అక్కడ వికిసిస్తోంది. యువత స్వయం ఉపాధితో మళ్లీ శక్తిమంత మవుతోంది. పర్యాటకులు వెల్లువెత్తుతున్నారు. ప్రజల ఆదాయాలు గణనీయంగా పెరుగు తున్నాయి. యువత ఉపాధికి కొత్త అవకాశాలను సృష్టించడం జరుగుతోంది. అయితే పహల్గామ్ ఉగ్రవాద దాడితో పర్యాటకుల వెల్లువ నిలిచిపోయింది. సామాన్య కశ్మీరీల ప్రయోజనాలకు తీవ్ర భంగం వాటిల్లింది.

పహల్గాంలో ఉగ్రవాద దాడి చోటుచేసుకున్న వెనువెంటనే ఆసేతు హిమాచలం అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వానికి మద్దతుగా నిలిచారు. మోదీ ప్రభుత్వం ఎటువంటి చర్య చేపట్టినా తాము సంపూర్ణంగా మద్దతునిస్తామని రాజకీయ పక్షాలు స్పష్టంగా ప్రకటించాయి. ఉగ్రదాడి ఘటన జరిగినప్పుడు సౌదీ అరేబియాలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన అధికారిక పర్యటనను మధ్యలోనే ముగించుకుని స్వదేశానికి తిరిగివచ్చారు. ఉగ్రదాడికి ఇంతకింత మూల్యం చెల్లించుకోక తప్పదని పాక్‌ను కఠినంగా హెచ్చరించారు. ఈ క్రమంలో తీసుకున్న చర్యల వల్లనే ఇప్పుడు పాక్ ఏకాకి అయ్యింది. దానికి ఇప్పుడు చైనా కూడా బహిరంగంగా మద్దతు ఇవ్వలేని దుస్థితి ఏర్పడింది. అందుకే పహల్గాం ఘటనపై తక్షణమే ప్రతీకార చర్యలు చేపట్టాలనే డిమాండ్లు దేశవ్యాప్తంగా వెల్లువెత్తుతున్నాయి. మెరుపుదాడులకు పాల్పడే విమానాలను పాక్ సైనిక దళాలు ముందుగానే పసిగట్టి అడ్డుకుంటాయని సైనిక నిపుణులు గట్టిగానే చెబుతున్నారు. అటువంటి దాడుల ఫలితాలు ఆశించినవిగా ఉండకపోవచ్చని కూడా నిపుణులు అంటున్నారు. భారత్ సైనిక పాటవ ఆధిక్యత దృష్ట్యా సర్జికల్ స్ట్రయిక్స్ కన్నా ఇతరత్రా ప్రత్యామ్నాయాలు ఉన్నాయని ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఈసారి దెబ్బకొడితే మళ్లీ పాక్ కోలుకోకుండా చేయాల్సి ఉంది. ఎందుకంటే గతంలో నెహ్రూ, ఇందిరల హయాంలో చేసిన తప్పుల వల్ల పివోకె అలాగే ఉండిపోయింది. పాక్ జుట్టు మన చేతిలో చిక్కినా వదిలి పెట్టాం. ఇలాంటి అనుభవాలన్నీ ఇప్పుడు మోడీ ప్రభుత్వం తప్పకుండా గణిస్తోంది. అందుకే సామ,భేద, దాన, దండోపాయాలపై కసరత్తు చేస్తున్నట్లుగా ఉంది. అమెరికా, రష్యాలు సైతం మద్దతుగా ఉన్నాయి. గల్ఫ్ దేశాలు కూడా పాక్‌ను నమ్మేస్థితిలో లేవు. పహల్గాం దాడులకు ప్రతీకారంగా ఎప్పుడు ఎలా ఎలాంటి చర్య తీసుకోవాలనే విషయమై సైనిక దళాలకు ప్రధానమంత్రి సంపూర్ణ స్వేచ్ఛనిచ్చినట్లు ప్రకటించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో జాతీయ భద్రతపై అత్యున్నత నిర్ణయాలు తీసుకునేది ప్రధానమంత్రి మాత్రమే. ఆ నిర్ణయాలను అమలుపరిచేది సైనిక దళాలు. పహల్గాంపై భారత్ ప్రతిస్పందన.. కశ్మీర్‌లో అల్లకల్లోలం సృష్టిస్తున్న శత్రు వర్గాలను అణచి వేయడం వంటివన్నీ ఇప్పుడు అమలు జరుగుతున్నాయి. ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయం వెనకా యుద్ధ తంత్రం దాగివుంది. అందుకే ప్రతి చర్యా పాక్‌ను కట్టడి చేసేలా ఉంటున్నాయి. భయంతో చస్తున్న పాక్ నేతలు అనవసర ప్రేలాపనలు పేలుతున్నారు.

# దేవాలయాల్లో వరుస ఘటనలు భక్తులు ప్రశాంతంగా దర్శించుకునే ఏర్పాట్లు

**అధికారులను ఆదేశించిన సిఎం చంద్రబాబు**



అమరావతి,**మే 06, రిపబ్లిక్ న్యూస్ :-** ఇటీవలి వరుస ఘటనల నేపథ్యంలో సచివాలయంలో దేవాదాయ శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు .వివిధ దేవాలయాల్లో జరిగిన దుర్ఘటనలపై చర్చించారు. భక్తులకు ప్రశాంత వాతావరణంలో దర్శనం, ఉత్సవాల సమయంలో రద్దీ నియంత్రణ ఏర్పాట్ల పై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. తిరుమల తిరుపతి, సింహాచలం సంఘటనలపై ఇప్పటికే అధికారులపై సీఎం చంద్రబాబు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. సింహచలం ఘటనకు సంబంధించి ఇప్పటికే ప్రభుత్వం ఏడుగురు అధికారులపై సస్పెన్షన్ వేటు- వేసింది. ఇటీవల విశాఖపట్నం జిల్లాలోని సింహాచలం వరాహ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో అపశృతి చోటు-చేసుకున్న విషయం తెలిసిందే. ఈదురుగాలులు, భారీ వర్షం కారణంగా రూ.300 టికెట్ క్యూలైన్ వద్ద షాపింగ్ కాంప్లెక్స్ సమీపంలోని సిమెంట్ గోడ కూలిపోయింది. ఈ దుర్ఘటనలో ఎనిమిది మంది భక్తులు మృతి చెందారు. ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. దీనికి బాధ్యులు ఎవరన్న దానిపై ఐఏఎస్ అధికారి సురేష్ కుమార్ నేతృత్వంలో త్రిసభ్య కమిటీని ముఖ్యమంత్రి చంద్రబాబు నియమించారు. విచారించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. దీంతో సింహాచలం ఘటనా స్థలంకు వెళ్లి పరిశీలించి త్రిసభ్య కమిటీ-.. మొత్తం 19 మందిని విచారించి ఈ ఘటనకు బాధ్యులెవరో తేల్చి.. మొత్తం ఆరు పేజీలతో నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. వెంటనే యాక్షన్‌లోకి దిగిన ప్రభుత్వం ఏడుగురు అధికారులపై సస్పెన్షన్ వేటు- వేసింది.

-------------

# అటవీ భూములపై సమాధానం చెప్పండి

**సజ్జలను డిమాండ్ చేసిన సోమిరెడ్డి**



అమరావతి,**మే 06, రిపబ్లిక్ న్యూస్ :-**వైసీపీ ప్రభుత్వ హయాంలో సకల మంత్రిగా వ్యవహరించిన సజ్జల రామకృష్ణా రెడ్డిపై టీడీపీ సీనియర్ నేత, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆనాడు అధికారం ఉందని ఎగిరిపడిన తాడేపల్లి క్లర్క్..ఇప్పుడు ఏ కలుగులో దాక్కున్నాడు అంటూ ఫైర్ అయ్యారు. గత ప్రభుత్వంలో ఐదేళ్లూ బ్లూ మీడియాను పార్టీ ఆఫీసుకు పిలిపించుకుని ఇంటర్వ్యూల మీద ఇంటర్వ్యూలు ఇచ్చిన సజ్జల నోరు నేడు ఎందుకు మూగబోయిందని ప్రశ్నించారు. నాడు చంద్రబాబు నాయుడుపైనా, నాటి ప్రతిపక్ష పార్టీల ప్రజా పోరాటాలపైనా నీతి మాలిన వ్యాఖ్యలు చేసిన సజ్జల రామకృష్ణారెడ్డి... 64 ఎకరాల అటవీ, ఎసైన్డ్ భూముల కబ్జాపై సమాజానికి సమాధానం చెప్పి తీరాలని డిమాండ్ చేశారు. అధికారం ఉన్నప్పుడు ఎగిరిపడిన ఆ తాడేపల్లి క్లర్క్.. తప్పులు, నేరాలు,ఘోరాలు చేశాడు కాబట్టే నేడు కలుగులో దాక్కున్నాడని అన్నారు. అటవీ భూములు మింగేసిన సజ్జలపై కూటమి ప్రభుత్వం చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కోరారు.

# సియుఇటి- యుజి పరీక్షలు వాయిదాకు మొగ్గు

న్యూఢిల్లీ,**మే 06, రిపబ్లిక్ న్యూస్ :-** సియుఇటి - యుజి పరీక్షలను వాయిదా వేయాలని నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ (ఎన్‌టిఏ) భావిస్తున్నట్లు- సంబంధిత వర్గాలు మంగళవారం ప్రకటించాయి. షెడ్యూల్ ప్ర కారం ఈ పరీక్షలు మే 8 నుండి జూన్ 1 వరకు, భారత్ సహా వివిధ దేశాలలో పలు పరీక్షా కేంద్రాల్లో నిర్వహించాలని నిర్ణయించారు. అయితే అధికారిక ప్రకటన వెలువడాల్సి వుంది. సమన్వయ సమస్యల కారణంగా వాయిదా వేసినట్లు- సమాచారం.అయితే ఈ అంశంపై అధికారిక ప్రకటన వెలువడాల్సి వుందని ఆ వర్గాలు తెలిపాయి. యూనివర్శిటీ-ల్లో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశం కోసం ఈ పరీక్షలను నిర్వహిస్తుంది.

నీట్ తర్వాత, దేశంలోనే ఇది రెండవ అతిపెద్ద ప్రవేశపరీక్ష. భారతదేశంలోని కేంద్ర, రాష్ట్ర, డీమ్డ్ మరియు ప్రైవేట్ యూనివర్శిటీ-ల్లో ప్రవేశం కోసం ప్రతి ఏడాది సుమారు 13 లక్షలకు పైగా విద్యార్థులు సియుఇటి పరీక్షల కోసం నమోదు చేసుకుంటారు.

# రోడ్డుప్రమాద బాధితులకు ఊరట

**ఆస్పత్రుల్లో లక్షన్నర వరకు ఉచిత వైద్యం**

**ఉత్తర్వులు జారీచేసిన కేంద్ర ప్రభుత్వం**





న్యూఢిల్లీ,**మే 06, రిపబ్లిక్ న్యూస్ :-** రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి, వారి కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. ప్రమాదంలో గాయపడ్డ వెంటనే నగదు రహిత చికిత్స అందించేలా ప్రవేశపెట్టనున్న కొత్త పథకం ఉపశమనం కలిగించనుంది. దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్స పథకాన్ని ప్రకటిస్తూ కేంద్ర ప్రభుత్వం మంగళవారం నోటిఫికేషన్ జారీ చేసింది. రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం ఈ పథకం కింద బాధితుడు ప్రమాదం జరిగిన తేదీ నుంచి ఏడు రోజుల వరకు ఏదైనా గుర్తింపు పొందిన ఆసుపత్రిలో గరిష్ఠంగా రూ.1.5 లక్షల వరకు నగదు రహిత చికిత్స పొందవచ్చు. ఈ పథకం మే 5సోమవారం నుంచే అమల్లోకి వచ్చినట్టు నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఈ పథకానికి 'క్యాష్‌లెస్ ట్రీ-ట్‌మెంట్ ఆఫ్ రోడ్ యాక్సిడెంట్ విక్టిమ్స్ స్కీం-2025' గా కేంద్ర ప్రభుత్వం నామకరణం చేసింది. రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం, ఎవరైనా మోటారు వాహనం వల్ల రోడ్డు ప్రమాదానికి గురైతే, ఈ పథకం కింద దేశంలోని ఏ ప్రాంతంలోనైనా వారికి ఉచిత చికిత్స లభిస్తుంది . ప్రమాద బాధితుడు ప్రభుత్వ లేదా నియమిత ఆసుపత్రులలో ఉచితంగా చికిత్స పొందవచ్చు. డబ్బు చెల్లించాల్సిన అవసరం లేదు.ఈ పథకం కింద, బాధితుడికి ప్రమాదం జరిగిన తేదీ నుంచి తదుపరి ఏడు రోజుల వరకూ గరిష్ఠంగా రూ. 1,50,000 వరకు ఉచిత చికిత్స అందుతుందని ప్రభుత్వం తెలిపింది.

# డబ్బులు డిమాండ్ చేసిన ఇద్దరు రిపోర్టర్ల రిమాండ్..

## ఇచ్చోడ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు. -కానిస్టేబుల్ ను సస్పెండ్ చేసిన జిల్లా ఎస్పీ..

**ప్రజా రిపబ్లిక్ న్యూస్ : ఆదిలాబాద్, ఇచ్చోడ..**
ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గానికి చెందిన ఇద్దరు రిపోర్టర్లు పేకాట ఆడుతున్న వారిని డబ్బులు డిమాండ్ చేయగా బాధితుల ఫిర్యాదు మేరకు ఇచ్చోడ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు కాగా, దీనికి సంబంధించిన ఓ ప్రముఖ టీవీ ఛానెల్ (బోథ్ ) కు చెందిన ,ఓ పత్రిక కు చెందిన జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లను జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండల పోలీసులు కేసు నమోదు వారిని అరెస్టు చేసి 15 రోజుల రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం బోత్ నియోజకవర్గానికి చెందిన ఓ ప్రముఖ టీవీ ఛానల్ రిపోర్టర్ తో పాటు పత్రిక రిపోర్టర్ లను 15 రోజుల క్రితం ఇచ్చోడ మండలం పరిధిలోని పరిసర పంట పొలంలో పేకాట ఆడుతున్న కొంతమందిని ఉన్నత పోలీస్ అధికారుల ఆదేశాలు లేకుండా ఇచ్చోడ పోలీస్ స్టేషన్ కు చెందిన కానిస్టేబుల్ పట్టుకున్నారని తెలిపారు. సదరు అధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, వీరిపై ఎలాంటి కేసు నమోదు చేయకుండా వారితో బేరం కుదుర్చుకొని రూ ..లు 50,000 తీసుకున్నట్లు తెలిసిందన్నారు. ఈ విషయం తెలుసుకున్న సదరు రిపోర్టర్లు సైతం ఈ కేసులో తమకు సైతం డబ్బులు కావాలని డిమాండ్ చేయగా, బాధిత పేకాట రాయుళ్లు 40 వేలు వీరికి ముట్టా చెప్పినట్లు తెలిసిందన్నారు. అంతే కాకుండా ఇచ్చోడ పోలీస్ స్టేషన్లో బాదితులు ఫిర్యాదు చేయగా, ఈ విషయం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ దృష్టికి వెళ్లిందని పేర్కొన్నారు. వెంటనే వారి ఆదేశాల మేరకు విచారణ చేయగా, కానిస్టేబుల్ పేకాట ఆడుతున్న వారి నుంచి 50 వేల రూపాయలు తీసుకున్నట్లు,సదరు రిపోర్టర్లు సైతం 40 వేల రూపాయలు డిమాండ్ చేసి వసూలు చేసుకున్నట్లు రుజువు కావడంతో ఇద్దరు రిపోర్టర్ల పై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేసి,ఆదివారం ఆదిలాబాద్ జిల్లా జైలుకు రిమాండ్ నిమిత్తం తరలించగా, కానిస్టేబుల్ విజయ్ ని గత కొన్ని రోజుల క్రితమే సస్పెండ్ చేసినట్లు తెలిసిందన్నారు. ఇంకా ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు,స్థానికులు పేర్కొన్నారు.

# పెళ్లి వేడుకల్లో విషాదం



**మంత్రాలయం మే6(రిపబ్లిక్ న్యూస్):-**
కర్నూలు జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. వివరాలలోకి వెళ్ళితే కౌతాళం మండలం ఉరుకుంద గ్రామంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో పెళ్లికి డెకరేషన్ చేస్తుండగా విద్యుత్ తీగలు తగిలి హరిజన సునిల్ కుమార్ (25),హరిజన, మహేంద్ర (22) అనే ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు..మృతులు ఉరుకుందు గ్రామానికి చెందిన వారు కాగా గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# బాలికల భవితకు కిశోర వికాసం



**మంత్రాలయం మే6(రిపబ్లిక్ న్యూస్):–**
కోసిగి మండలం చిర్తనకల్లు గ్రామంలో బాలికలకు ఎదురయ్యే సమస్యలపై అవగాహన కార్యక్రమం కల్పించేందుకు ప్రభుత్వం "కిశోర వికాసం" పేరుతో ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. చిర్తనకల్ గ్రామంలో అంగన్వాడి టీచర్ రత్నప్రభ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అంగన్వాడి సూపర్వైజర్ క్యాతయిని హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి అంగన్వాడి సూపర్వైజర్ క్యాతాయిని మాట్లాడుతూ గ్రామాల్లో ఏ తల్లిదండ్రులు కూడా బాల్యవివాహాలు చేయరాదు, బాలల హక్కుల చట్టం గురించి అవగాహన కల్పించారు, మహిళల భద్రతలపై సూచనలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు, రాజేశ్వరి తిక్కమ్మ, విజయలక్ష్మి, తదితరులుపాల్గొన్నారు

# క్రీడాకారులకు ఎమ్మెల్యే శ్యాం కుమార్ ఆర్థిక సాయం




**పత్తికొండ,:: ప్రతినిధి మే 6 (రిపబ్లిక్ న్యూస్)**
గుంటూరు జిల్లా పిడుగురాళ్ల లో నిర్వహించిన అండర్ 19 క్రికెట్ టెన్నిస్ బాల్ టోర్నమెంట్లో జాతి స్థాయిలో ఎంపికైన పత్తికొండ కు చెందిన ఇలియాస్ భాష ,రసూల్ ,ముఖేష్ లకు స్థానిక ఎమ్మెల్యే కేఈ శ్యాం కుమార్ ఆర్థిక సాయం అందించారు. ఈ నెల 9 ,10 ,11 తేదీలలో నాగపూర్ లో జరిగే నేషనల్ టోర్నమెంట్ లో ఈ క్రీడాకారులు ఆడబోతున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని అభినందించారు. క్రీడాకారులకు .కే. ఈ.శ్యామ్ కుమార్ ఆర్థిక సహాయం అందించి, చేయూతనిచ్చారు. ఈ మొత్తాన్ని టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు కె. సాంబ శివారెడ్డి స్థానిక టిడిపి ప్రాంతీయ కార్యాలయంలో క్రీడాకారులకు అందజేశారు.

## 68 ఏళ్ళ భారతీయున్ని మత్తుపానియాల విముక్తి భారత్,స్వస్థ భారత్ శంకల్పంతో

# 24 నెలలు చేరుకున్న చైతన్య యాత్రా!



**చిత్తూర్ జిల్లా ప్రతినిధి**
**6 మే ( రిపబ్లిక్ న్యూస్ ):**



అభిరామ్ సత్పాతి అనే ఒరిస్సా కి చెందిన విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి (%శీజ్ఎశ్రీ%) జర్సిగూడ, పవర్ స్టేషన్ హెడ్ క్లర్క్. తన 24 నెల పాదయాత్రలో భాగంగా చిత్తూర్ పట్టణం చేరుకున్నారు, అభిరామ్ రిపబ్లిక్ మీడియా తో మాట్లాడుతూ, తాను మత్తు పానియాలుతో ఎవరు బానిస కాకూడదు అనే ఒక మంచి ఉద్దేశం తో మొత్తం భారతదేశం తిరిగి మత్తు విముక్తి భారతదేశం అనే నినాదం తో తన స్వగ్రామం దుర్లగా, జార్శి గుడా జిల్లా ఒడిస్సా రాష్ట్రం నుండి 25 మే, 2023 తన పాదయాత్రని మొదలుపెట్టినట్టు చెప్పారు, అక్కడి నుండి సుద్దుఖండ కిషన్ నగర్ కట్టక్,ఒడిశా చేరుకున్నారు, తరువాత వెస్ట్ బెంగాల్ మీద కొనసాగుతూ భూటాన్ దేశం ఫున్సీలింగ్ చేరుకున్నారు అక్కడనుండి నేపాల్ దేశానికి చెందిన కాకర్వేటా గెట్ ప్రవేశం చేసి అక్కడి నుంచి జనక్కపూరి దాం మీదుగా తాజ్పాపాణి చైనా బార్డర్ చేరుకున్నారు, అక్కడి నుంచి కాట్మండు చేరుకొని సోనావళి బార్డర్ దగ్గర ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రంలో మళ్ళీ భారత్ చేరుకున్నారు , అక్కడినుంచి పంజాబ్ రాష్ట్రానికి చెందిన వాగా బోర్డర్ చేరుకున్నారు, వాగాబోర్డర్ తర్వాత శ్రీనగర్ సన్మార్గ చేరుకున్నారు అక్కడి నుంచి మళ్లీ పార్లమెంట్ భవన్ దగ్గర ఇండియా గేట్ సందర్శించారు మళ్ళీ ముంబై చేరుకొని అక్కడనుండి గోవా ద్వారా కర్ణాటక రాష్ట్రం నడుచుకుంటూ తమిళనాడు రాష్ట్రం లోని ఆఖరి సముద్ర తీరం కన్యాకుమారి, రామేశ్వరం చేరుకున్నారు, ఆ తరువాత మధురై ద్వారా చిత్తూరు చేరుకున్నారు చిత్తూరు నుండి తిరుపతి మీదుగా ఒడిస్సా లో ని తన స్వగ్రామం జార్సుధ జిల్లాకి తన తిరుగు ప్రయాణం కొనసాగిస్తున్నారు, అతను 68 ఏళ్ల వయసులో 24 నెల లో మొత్తం 12100 కిలోమీటర్ పాదయాత్ర పూర్తి చేసుకునట్టు తెలిపారు , ఇంకా 1500 కిలిమీటర్ పూర్తి చేస్తే తన సంకల్ప యాత్రాని పూర్తి చేయనున్నట్టు తెలిపారు!!

## ఇరువారం పొన్నూవేలు చిత్తూర్ HRPC జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక






**చిత్తూర్ జిల్లా ప్రతినిధి 6 మే 2025 ( రిపబ్లిక్ న్యూస్ ):**
విజయవాడా వేదికగా జరిగిన, "ఆంధ్ర రాస్ట్రా హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ అఫ్ పీపుల్ జిల్లా కమిటీల ఎన్నిక సందర్భంగా చిత్తూర్ కు చెందిన ఇరువారం పొన్నూవేలుని, హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ అఫ్ పీపుల్ జాతీయ అధ్యక్షులు జ్ఞాన సుందరి చెత, చిత్తూర్ జిల్లా ప్రధానా కార్యదర్శి గా ఎన్నుకోపడ్డట్టు పత్రికా ప్రకటనా ద్వారా హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్విల్ అఫ్ పీపుల్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బాలు తెలిపారు!!మీడియా తో పొన్నూవేలు మాట్లాడుతూ, HRPCP జాతీయ అధ్యక్షులు జ్ఞానసుందరి తన మీద నమ్మక్కం ఉంచి అప్పగించిన జిల్లా ప్రధాన కార్యదర్శి బాధ్యతని, తాను తన పూర్తి బాధ్యత వహించ్చి శ్రామించదానికి సిద్ధంగా ఉన్నట్టు , అదేవిధముగా తనకి ఇవ్వబడ్డ, ఈ ప్రజా సేవ అవకాశన్ని సద్వినియోగం చేసుకుంటానంటూ తెలిపారు!!

# ఆశా కార్యకర్తలకు ఉద్యోగ భద్రత కల్పించాలి




డాక్టర్ సవితకు సమ్మె నోటీసి ఇస్తున్న ఆశా కార్యకర్తలు

**బండి ఆత్మకూరు, మే 6, (రిపబ్లిక్ న్యూస్): -** ఆశా కార్యకర్తలకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్, సిఐటియు నాయకులు సమ్మెకు దిగనున్నారు. ఇందులో భాగంగా మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆశా కార్యకర్తలు డాక్టర్ సవితకు సమ్మె నోటీసు ఇవ్వడం జరిగింది. అలాగే నారాయణపురం గిరిజన ఆస్పత్రి పరిధిలోని ఆశా కార్యకర్తలు అక్కడి వైద్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్ కు సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు రత్నమయ్య, మండల నాయకులు రాజులు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 44 రకాల కార్మిక చట్టాలను రద్దు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకువచ్చి కార్మికులను శ్రామికులను కట్టు బానిసలుగా మార్చే చట్టాలను అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం పూనుకుందని వారు మండిపడ్డారు. కార్మికుల కు కనీస వేతనం రూ 26,000 ఇవ్వాలని జిడిపిలో ఆరు శాతం నిధులు వైద్యానికి కేటాయించి ఆశలకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతన కటం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 20వ తేదీ వరకు జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆశ యూనియన్ నాయకురాలు సువర్ణమ్మ, భాగ్యమ్మ, నాగలక్ష్మి, అరుణమ్మ, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల అర్హుల ఎంపికలో అవకతవకలు




**ఆదిలాబాద్ జిల్లా మే 06 (రిపబ్లిక్ న్యూస్)**
బజార్ హత్నూర్ మండలంలోని గిన్నూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల అర్హుల ఎంపికలో అవకతవకలు జరిగినట్టు స్థానిక ఎంపీడీవోకు గిర్నూర్ గ్రామానికి చెందిన సాకలి గంగమణి అనే వితంతు మహిళ వినతి పత్రం అందించడం జరిగింది. అర్హులైనటువంటి వారిని కమిటీ సెలక్ట్ చేయకుండా అనర్హులు సెలెక్ట్ చేయడం జరిగింది అని.. ఎలాంటి ఇండ్లు లేకుండా ఉన్నటువంటి వ్యక్తులకు ఇందిరమ్మ ఇండ్లను ఇవ్వకుండా ఇండ్లు కలిగి ఉన్న వారి యొక్క పేర్లను ఫైనలైజ్ చేయడం జరిగింది అని.. నా భర్త చనిపోయి ఇద్దరు ఆడపిల్లలతో రేకుల ఇంట్లో ఉంటున్నాను.. మా గ్రామ ఇందిరమ్మ కమిటీ సభ్యుల అనర్హత కలిగినటువంటి. కొందరి వ్యక్తులను ఎంపిక చేసి అన్ని అర్హతలు కలిగిన నన్ను ఎంపిక చేయలేదు కావున సరియైన సమాచారం ఎంక్వయిరీ చేసి నాకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి న్యాయం చేయవలసిందిగా నా యొక్క మనవి చేస్తున్నాను అని..ఎంపిడిఓ కు వినతి పత్రం అందజేసింది..

# బిజెపి మండల అధ్యక్షునికి సన్మానం



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, మే 06 ( రిపబ్లిక్ న్యూస్)**
భారతీయ జనతా పార్టీ ధర్మపురి నియోజకవర్గం ధర్మారం మండల అధ్యక్షునిగా నూతనంగా నియామకమైనా తీగుల్ల సతీష్ రెడ్డి ని జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన బీజేవైఎం జిల్లా సీనియర్ నాయకులు తిరుమల ప్రమోద్ ఘనంగా సన్మానించారు. సతీష్ రెడ్డి నాయకత్వంలో ధర్మారం మండలం తో పాటు, ధర్మపురి నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ బలోపేతం అవుతుందని ప్రమోద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సురేష్, పులి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణే మానవాళికి మనుగడ

## - ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి
## - యాష్ పాండ్ సమీపంలో మొక్కలు నాటిన ఎన్టిపిసి ఈ.డి. చందన్ కుమార్ సమంత







**పెద్దపెల్లి జిల్లా ప్రతినిధి ,మే 6( రిపబ్లిక్ న్యూస్):** పర్యావరణాన్ని పరిరక్షించడానికి ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని, పెంచాలని రామగుండంఎన్టీపీసీ ఈ. డి చందన్ కుమార్ సమంత అన్నారు. యాష్ పాండ్ సమీపంలో మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. జి.ఎమ్ (ఓఅండ్ ఎం), ఎ.కె. త్రిపాఠిబీ తెలంగాణ జి.ఎంమ్ (ఓ అండ్ ఎం), ముకుల్ రాయ్‌బీ జి.ఎమ్ (ఆపరేషన్) కె.సీ. సింఘా రాయ్‌బీ ఎచ్ అండ్ అర్ (అర్ అండ్ టి ) హెడ్ బిజోయ్ కుమార్ సిక్దార్‌బీ ఎన్టీపీసీ అర్ అండ్ టి మ టి ఎఫ్ డి సి ఎల్ బృందం నుండి ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ. డి సమంత మాట్లాడుతుఎన్టీపీసీ అర్ అండ్ టీ చేసిన మొక్కల పెంపకానికి చేసిన ప్రయత్నాలు ప్రయత్నాలు పర్యావరణ సమతుల్యతను కాపాడతాయని అన్నారు. మొక్కల పెరుగుదలతో కార్బన్ డై ఆక్సైడ్ ను తగ్గించి ఆక్సిజన్ పెంచడానికి ఉపయోగపడతయన్నారు. పరిసర ప్రాంతంలో చుట్టుపక్కల జీవవైవిధ్యాన్ని పెంచడం లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు ఎన్టీపీసీ దాని విద్యుత్ ప్లాంట్ల చుట్టూ అటవీకరణ కార్బన్ సింక్‌ల సృష్టిపై దృష్టి సారించిందన్నారు. ప్లాంట్ ప్రాంగణంలో,చుట్టుపక్కల గ్రీన్‌బెల్ట్‌ను అభివృద్ధి చేయడానికి ఎన్టీపీసీ ప్రారంభం నుండి విస్తృతమైన ప్లాంటేషన్ డ్రైవ్‌లను చేపట్టిందన్నారు. తెలంగాణ ఉప్పు నేల, అసమాన భూభాగంతో ప్రభావితమైన భూమిలో మొక్కల పెంపకం కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ సహకారంతో ప్లాంటేషన్ డ్రైవ్ చేపట్టామన్నారు. గ్రీన్ బెల్ట్ అభివృద్ధి కోసం తెలంగాణ ప్లాంట్ యాష్ చెరువు సమీపంలో భూమిని చదును చేయడం,జిప్సం ఎరువును ఉపయోగించి మంచి భూమి పొరలు వేయడం నేల కండిషనింగ్ ద్వారా భూమిలో మొక్కలు నాటడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు . 33 ఎకరాల్లో వివిధ రకాల స్థానిక జాతులకు చెందిన 33,000 మొక్కలను నాటడానికి ఎన్టీపీసీ తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ కు బాధ్యత అప్పగించిందన్నారు.

# నేడు హైదరాబాద్ లో కులగణన డాక్యుమెంట్ రూపకల్పన

## - బీసీలంతా అధిక సంఖ్యలో పాల్గొనాలి
## - బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముచిపట్ల లక్ష్మీనారాయణ



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, మే 06 ( రిపబ్లిక్ న్యూస్)**
దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం నిర్వహించబోయే జన గణనలో కుల గణన కూడా చేపట్టే కార్యక్రమాన్ని తీసుకోవడం హర్షించదగ్గ విషయమని, ఈ కుల గణన సర్వేలో తగిన సూచనలు, సలహాలు పొందుపరిచి సమగ్ర డాక్యుమెంటును కేంద్ర ప్రభుత్వానికి నివేదించడానికి నేడు హైదరాబాద్ లకిడికపూల్ లోని అశోక హొటల్ లో ఉ.11 గం. కు జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చర్చా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి మునిపట్ల లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఈ చర్చా వేదికలో బీసీలంతా ఒక ప్రతినిధి బృందంగా బీసీల ప్రయోజనం కోసం ప్రాతినిధ్యం వహిస్తూ న్యూఢిల్లీకి వెళ్లే అంశం పైన చర్చించడం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య హాజరవుతారని, కావున జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులంతా సకాలంలో చర్చా వేదికలో పాల్గొనాలని మునిపట్ల లక్ష్మీనారాయణ కోరారు.

# అందానికి అదృష్టం తోడైతేనే !



వెండితెరపై హీరో ఎన్ని సాహసాలు .. పోరాటాలు చేసినా, ఆయన హీరోయిన్ తో కలిసి పాడుకునే సమయం కోసమే ఆడియన్స్ వెయిట్ చేస్తూ ఉంటారు. అలాగే హీరో సామాజిక సేవలో ఎంతగా తరిస్తూ ఉంటాడనే దానికంటే, ఆయన హీరోయిన్ తో కలిసి చేసే రొమాన్స్ కోసం ఆడియన్స్ ఎక్కువ ఇంట్రెస్ట్ చూపిస్తూ ఉంటారు. హీరో కోసం థియేటర్ కి వచ్చినా, హీరోయిన్ ఎప్పుడు తెరపైకి వస్తుందా అని ఎదురుచూడని మాస్ ఆడియన్స్ దాదాపుగా ఉండరు. అందుకనే హీరోయిన్స్ అందంగా ఉండేలా మేకర్స్ శ్రద్ధ తీసుకుంటూ ఉంటారు. అలాంటి అందాల హీరోయిన్స్ జాబితాలో ఈ మధ్య 'ఇవాన' కనిపిస్తోంది. తమిళంలో నెక్స్ట్ లెవెల్ హీరోయిన్స్ బౌండరీలోకి అడుగుపెట్టడానికి ట్రై చేస్తున్న ఈ బ్యూటీ, ఒక హిట్ తో తెలుగు ఆడియన్స్ ముందుకు రావడానికి ఆరాటపడుతోంది. అలా ఆమె చేసిన సినిమానే 'సింగిల్'. శ్రీవిష్ణు జోడీగా ఆమె నటించిన ఈ సినిమా, ఈ నెల 9వ తేదీన థియేటర్లకు వస్తోంది. కార్తీక్ రాజు దర్శకత్వం వహించిన ఈ సినిమాలో తాను 'హరిణి' అనే పాత్రలో కనిపిస్తాననీ, ఈ పాత్ర తనకి మంచి గుర్తింపు తెచ్చిపెడుతుందనే నమ్మకంతో ఇవాన ఉంది. విశాలమైన కళ్లతో .. నవరసాలను నాజూకుగా పలికించే ఈ సుందరికి, ఇక్కడ కూడా అభిమానుల సంఖ్య ఎక్కువే. అందం విషయంలో అమ్మడికి ఢోకా లేదు. కాకపోతే అదృష్టం కూడా తోడుకావాలంతే అంటున్నారు ఫ్యాన్స్. ఈ సినిమాతో తెలుగులోనూ ఈ బ్యూటీ బిజీ అవుతుందేమో చూడాలి మరి.

# క్యాథరిన్ థెస్రాకు బంపర్ ఆఫర్



టాలీవుడ్‌లో అందం అభినయంతో ఆకట్టుకొనే గ్లామర్ హీరోయిన్ లో క్యాథరిన్ త్రెసా ఒకరు. 'చమ్మక్ చలో' మూవీతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ- ఇచ్చి నానితో 'పైసా', అల్లు అర్జున్‌తో 'ఇద్దరు అమ్మాయిలతో', 'రుద్రమదేవి', 'సరైనోడు' వంటి చిత్రాల్లో నటించింది. వరుస విజయాలతో దూసుకెళ్లిన క్యాథరిన్ తెరపై కనిపించి చాలాకాలం అవుతుంది. అవకాశాలు తగ్గడంతో సైలెంట్ అయిపోయింది. సోషల్ మీడియాలో కూడా కనిపించడం లేదు. ఇక తాజాగా ఈ అమ్మడు బంపర్ ఆఫర్ కొట్టేసింది..మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబోలో మంచి ఫ్యామిలీ మూవీ తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ మే లాస్ట్ వీక్ లో ప్రారంభం కానుంది. పూజా కార్యక్రమాలు, ఓపెనింగ్ అయిపోయింది కాబట్టి నేరుగా సెట్స్ లోకి వెళ్ళిపోతారు. ఇక ముందు నుంచి వైరల్ అవుతున్నట్లు-గా మెయిన్ హీరోయిన్‌గా నయనతార ఒకే అయిన విషయం తెలిసిందే. ఇక రెండో కథానాయికగా క్యాథరిన్ త్రెస్సా ఓకే అయ్యిందట. సెకండ్ హీరోయిన్ అయినప్పటికి చిరుతో ఒకటి రెండు పాటలు ఉండడోతున్నయట. అయితే ఇక్కడ క్యాథరిన్ చిరుకి సంబందించి ఓ వార్త వైరల్ అవుతుంది..

ఏంటీ- అంటే.. చిరంజీతో నటించే అవకాశం క్యాథరిన్ కు 2017లోనే వచ్చిందట. 'ఖైదీ నెంబర్ 150' కోసం వివి వినాయక్ తొలుత ఆమెనే అనుకున్నారట. కానీ సుష్మితతో వచ్చిన విబేధాల కారణంగా క్యాథరిన్‌ని తప్పించి కాజల్ అగర్వాల్‌ని తీసుకున్నారట. ఇక కట్ చేస్తే తొమ్మిది సంవత్సరాల తర్వాత క్యాథరిన్ తిరిగి ఆ ఛాన్స్ దక్కించుకోవడం విశేషం.

## ఇట్స్ కన్ఫామ్... తల్లిదండ్రులు కాబోతున్న లావణ్య త్రిపాఠి, వరుణ్ తేజ్



టాలీవుడ్ యువ కథానాయకుడు వరుణ్ తేజ్, నటి లావణ్య త్రిపాఠి దంపతులు తమ అభిమానులకు ఓ తీపి కబురు అందించారు. తాము త్వరలో తల్లిదండ్రులం కాబోతున్నట్లు సోషల్ మీడియా వేదికగా అధికారికంగా వెల్లడించారు. గత కొంతకాలంగా లావణ్య గర్భవతి అంటూ వస్తున్న వార్తలకు ఈ ప్రకటనతో తెరపడింది. ఈ జంట తమ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలలో ఓ ప్రత్యేకమైన ఫొటోను పంచుకున్నారు. ఆ ఫొటోలో చిన్నారి షూస్‌తో పాటు వరుణ్, లావణ్య ఒకరి చేతిని ఒకరు పట్టుకుని కనిపించారు. ఈ ఫొటోకు "జీవితంలో అత్యంత అందమైన పాత్ర పోషించబోతున్నాం. త్వరలో రాబోతుంది" అనే అర్థవంతమైన వ్యాఖ్యను జోడించి, తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ పోస్ట్ క్షణాల్లో వైరల్‌గా మారింది. గతేడాది (2023) ఇటలీలో వైభవంగా వివాహం చేసుకున్న ఈ జంట, తమ ప్రేమ బంధాన్ని తర్వాతి దశకు తీసుకువెళ్తున్నట్లు ఈ ప్రకటన ద్వారా తెలిపారు. ఈ వార్త తెలియగానే మెగా కుటుంబ సభ్యులు, అభిమానులు, సినీ పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా వరుణ్, లావణ్య దంపతులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. నెటిజన్లు కూడా వారికి అభినందనలు తెలుపుతూ కామెంట్లు పెడుతున్నారు. మెగా ఫ్యామిలీలో సంతోషకరమైన వాతావరణం నెలకొంది. సినిమాల విషయానికొస్తే, వరుణ్ తేజ్ వివాహం తర్వాత కూడా వరుసగా చిత్రాల్లో నటిస్తూ కెరీర్‌పై దృష్టి సారించారు. ప్రస్తుతం ఆయన పలు ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు.

## 'హరిహర వీరమల్లు' షూటింగ్ ముగించుకున్న పవన్ కల్యాణ్



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న భారీ చారిత్రక చిత్రం 'హరిహర వీరమల్లు' చిత్రీకరణ ఎట్టకేలకు పూర్తయింది. పలుమార్లు వాయిదాల అనంతరం, ఈ సినిమా షూటింగ్ ఈ వారం హైదరాబాద్‌లో ప్రత్యేకంగా నిర్మించిన సెట్‌లో ముగిసినట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ వార్త పవన్ కళ్యాణ్ అభిమానుల్లో, తెలుగు సినీ పరిశ్రమలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ చిత్రంలో పవన్ సరసన నిధి అగర్వాల్ కథానాయికగా నటించింది. ఆస్కార్ విన్నింగ్ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీవారణి ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న పవన్ కళ్యాణ్, తన రాజకీయ కార్యక్రమాలతో బిజీగా ఉన్నప్పటికీ, ఈ సినిమా చివరి షెడ్యూల్ కోసం రెండు రోజులు కేటాయించారు. ఈ రెండు రోజుల్లో ఆయనకు సంబంధించిన మిగిలిన సన్నివేశాల చిత్రీకరణను పూర్తి చేశారు. షూటింగ్ విజయవంతంగా ముగిసిన సందర్భంగా, సాంప్రదాయబద్ధంగా గుమ్మడికాయ కొట్టే కార్యక్రమాన్ని కూడా నిర్వహించనున్నట్లు సమాచారం. చిత్రీకరణ పూర్తయిన నేపథ్యంలో, నిర్మాతలు త్వరలోనే సినిమా కొత్త విడుదల తేదీని ప్రకటిస్తారని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. గతంలో పలు వాయిదాల కారణంగా నిరాశ చెందిన అభిమానులకు ఇది ఊరటనిచ్చే అంశం.

క్రిష్ జాగర్లమూడి, ఏఎం జ్యోతి కృష్ణ దర్శకత్వంలో 'హరిహర వీరమల్లు' 17వ శతాబ్దపు మొఘల్ సామ్రాజ్య కాలం నాటి కథతో తెరకెక్కుతోంది. భారీ యాక్షన్ సన్నివేశాలు, ఆసక్తికరమైన చారిత్రక కథనంతో ఈ సినిమా ప్రేక్షకులను అలరించనుంది. వాస్తవానికి మే 9న విడుదల కావాల్సి ఉండగా, పవన్ కళ్యాణ్ రాజకీయ కార్యకలాపాలు, సినిమా షూటింగ్ షెడ్యూళ్ల మధ్య సమన్వయం కారణంగా పలుమార్లు వాయిదా పడింది. ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా విడుదల చేయనున్నారు. త్వరలోనే ట్రైలర్, కొత్త పాటలు విడుదల చేసి సినిమాపై అంచనాలను మరింత పెంచేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తోంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ ఒక ప్రకటన విడుదల చేసింది. "పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ గారు 'హరిహర వీరమల్లు' చివరి రెండు రోజుల షూటింగ్‌లో పాల్గొన్నారు. దీంతో ఈ భారీ సినిమా షూటింగ్ ప్రయాణం దిగ్విజయంగా ముగిసింది. మీరు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ట్రైలర్, అద్భుతమైన పాటలు త్వరలోనే మీ ముందుకు రానున్నాయి. తుపానుకు కౌంట్‌డౌన్ ఇప్పుడు మొదలైంది" అని మేకర్స్ తెలిపారు.

ప్రస్తుతం 'హరి హర వీరమల్లు' పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లోకి ప్రవేశించనుంది. ఈ సినిమా చిత్రీకరణ పూర్తి కావడంతో, పవన్ కళ్యాణ్ తన తదుపరి చిత్రం 'ఓజీ' పై దృష్టి సారించే అవకాశం ఉందని తెలుస్తోంది. 'ఓజీ' సినిమా షూటింగ్ కూడా పవన్ కళ్యాణ్ బిజీ షెడ్యూల్ కారణంగా కొంత ఆలస్యమైన విషయం తెలిసిందే.

# రెట్రో లుక్ లో అంచనాలు పెంచేస్తున్న హీరోయిన్

దుల్కర్ సల్మాన్ హీరోగా సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఆ సినిమా పేరు కాంత. ఈ సినిమా నుంచి దుల్కర్ ఫస్ట్ లుక్ రిలీజై ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ తెచ్చుకుంది. 1950 నాటి స్టైల్ లో దుల్కర్ చాలా కొత్తగా కనిపించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. కాంత ఫస్ట్ లుక్ వచ్చినప్పటి నుంచి ఈ సినిమాపై అందరికీ అంచనాలు పెరిగాయి.

ఆ అంచనాలను ఏ మాత్రం తగ్గకుండా రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్ కాంత సినిమాను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. సినిమాపై ఇంట్రెస్ట్ ను, హైప్ ను పెంచడానికి చిత్ర యూనిట్ ఎప్పటికప్పుడు కాంత మూవీకి సంబంధించిన అప్డేట్స్ ను షేర్ చేస్తూ ఆ సినిమా నుంచి కీలక నటుల లుక్స్ ను రిలీజ్ చేస్తోంది. అందులో భాగంగానే తాజాగా కాంత సినిమాలోని హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే లుక్ ను రిలీజ్ చేసింది. ఇవాళ భాగ్యశ్రీ బోర్సే పుట్టినరోజు కానుకగా ఆమెకు బర్త్ డే విషెస్ తెలియచేస్తూ మేకర్స్ ఈ పోస్టర్ ను రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ లో భాగ్యశ్రీ తనకు సరిగ్గా సూటయ్యే లుక్ లో ఎంతో అందంగా కనిపించింది. చీర కట్టు, గాజులు, బొట్టుతో అచ్చతెలుగమ్మాయిలా భాగ్యశ్రీ ఈ పోస్టర్ లో దర్శనమిచ్చింది. 1950 కాలం నాటి పాత్రలో భాగ్యశ్రీ భలే ఒదిగిపోయింది. కాంతలోని భాగ్యశ్రీ లుక్ కు ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో రిలీజ్ కానుంది.




# ఆయన కారణంగానే సినిమా పాటలంటే ఇష్టం ఏర్పడింది: త్రివిక్రమ్



దివంగత రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి కారణంగానే తనకు సినిమా పాటలంటే ఇష్టం ఏర్పడిందని స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ అన్నారు. సిరివెన్నెల, త్రివిక్రమ్ మధ్య ఉన్న అనుబంధం అందరికీ తెలిసిందే. సిరివెన్నెల సీతారామ శాస్త్రి గురించి త్రివిక్రమ్ శ్రీనివాస్ చెప్పినంతగా ఇప్పటి వరకూ ఎవరూ చెప్పి ఉండరు. ఎందుకంటే వారిద్దరి మధ్య ఉన్న అనుబంధం అలాంటిది. తాజాగా మరోసారి సిరివెన్నెల గురించి త్రివిక్రమ్ శ్రీనివాస్ కీలక విషయాలను పంచుకున్నారు. తాను సినీ ఇండస్ట్రీకి రాకముందు వరకూ పాటలు పెద్దగా నచ్చేవి కావని, అలాంటి సమయంలో సిరివెన్నెల సినిమాలోని 'విధాత తలపున' పాట విని మైండ్ బ్లాంక్ అయిందన్నారు. ఆ పాట తనను విపరీతంగా ఆకట్టుకుందన్నారు. అందులోని పదాలకు అర్థం వెతకడం కోసం డిక్షనరీ తిరగేశానని, తెలుగు పదాలకు కూడా డిక్షనరీ ఉంటుందని అప్పుడే తనకు తెలిసిందని అన్నారు. అయితే ఆ పాట తర్వాత సిరివెన్నెల సీతారామ శాస్త్రి రాసిన పాటలు ఎందుకో అంత గొప్పగా అనిపించలేదన్నారు. ఇప్పటికీ ఆయన రాసిన పాటల్లో 'విధాత తలపున' పాట చాలా గొప్పదిగా అనిపిస్తుందన్నారు. అందరికీ అర్థమయ్యేలా పాటలు రాయడానికి ఆయన ఎన్నో తేలికైన పదాలు వాడటం ప్రారంభించారన్నారు. అంతే కాకుండా తన సినిమాల్లోని సీన్లకు ఒక్కోసారి చాలా వెర్షన్లు రాసేవారన్నారు. జల్సా మూవీలోని 'ఛలోరే ఛలోరే' అనే పాటకు 30 వెర్షన్లు రాశారని, అందులో తాను రెండు మాత్రమే తీసుకున్నానని తెలిపారు. ఆయన అన్ని పాటలను ఒకేలా చూస్తారని, ప్రేక్షకులకు నచ్చేలా రాయడమే ఆయన గొప్పతనమని త్రివిక్రమ్ పేర్కొన్నారు.



